


# విజయభాను




విశాఖపట్నం, శనివారం 15-12-2018 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 82 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# ముంచుకొస్తున్న ముప్పు

## అప్రమత్తమైన ఏపీ ప్రభుత్వం .. తీవ్రంగా మారిన వాయుగుండం

## 16, 17 తేదీల్లో భారీ వర్షాలు..!



విశాఖపట్నం : ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత తీవ్రమైంది. ఇది ప్రస్తుతం చెన్నైకి 1040 కి.మీ, మచిలీపట్నానికి 1210 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. వాయువ్య దిశగా కోస్తాంధ్ర తీరం వైపు ఇది గంటకు 8 కి.మీ వేగంతో కదులుతోంది. రాగల 24 గంటల్లో తుపానుగా మారనుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తదుపరి పెను తుపానుగా మారనున్నట్లు చెప్పారు. వాయుగుండం ప్రభావంతో దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడులో ఆకాశం మేఘావృతమై ఉంది. రాగల 24 గంటల్లో కోస్తాంధ్రలోని పలు ప్రాంతాల్లో వర్షాలు పడే అవకాశం ఉంది. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలతోపాటు తమిళనాడులోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయి.

తీవ్ర వాయుగుండం ప్రభావంతో తీరం వెంబడి పెనుగాలులు వీస్తున్నాయి. దీంతో సముద్రం అల్లకల్లోలంగా మారిందని.. కోస్తాంధ్ర తీరంలో మత్స్యకారులు చేపలవేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. కోస్తాంధ్రలో కొన్ని చోట్ల 20 సెం.మీలకుపైగా వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

**అప్రమత్తమైన ఏపీ ప్రభుత్వం**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తుపానుపై ముందస్తు సన్నద్ధత

తరువాయి 2లో..

### ఈ నెల 15న డల్లాస్‌లో జనసేన

# 'ప్రవాస గర్జన'

**టయోటా మ్యూజిక్ ఫ్యాక్టరీలో 'గర్జన' ఏర్పాట్లు**
**సుమారు వెయ్యి కార్లతో ర్యాలీకి సన్నాహాలు**
**'రా సైనికా' అనే వీడియో సాంగ్ విడుదల**
**ఎన్నారైలతో మమేకంకానున్న జనసేనాని**



డల్లాస్: అమెరికా పర్యటనలో బిజీగా ఉన్నారు జనసేన అధినేత పవన్ కళ్యాణ్. జనసేన పోరాట యాత్రతో ప్రజా సమస్యలపై ఫోకస్ పెట్టిన పవన్.. ఇప్పుడు ఎన్నారైలను కూడా పార్టీతో మమేకం చేసేందుకు సిద్ధమయ్యారు. యూఎస్ టూర్‌లో భాగంగా ఈ నెల 15 (శనివారం) డల్లాస్‌లో 'జనసేన ప్రవాస గర్జన' నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. గర్జనలో భాగంగా ఎన్నారైల కుటుంబాలతో

తరువాయి 2లో..

### విశాఖ ఉత్సవ్‌ను

# విజయవంతం చేయండి

- డిసెంబర్ 28, 29, 30 తేదీలలో విశాఖ ఉత్సవ్
- 28న రాష్ట్ర ముఖ్యమంత్రిచే ప్రారంభోత్సవం
- విశాఖ పురస్కారాలకు రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక
- రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నంః ప్రతీ సంవత్సరం నిర్వహించే విశాఖ ఉత్సవ్‌ను ఈ నెల28, 29, 30 తేదీలలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. శుక్రవారం ఉదయం మంత్రి విశాఖ ఉత్సవాల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ఏర్పాట్లు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల సందర్భంగా అధికారులకు సరైన ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. పలు ఈవెంట్లను, ఎగ్జిబిషన్స్‌ను, స్టాల్స్‌ను, బెలూన్స్, హెలిటూరిజం, ఫిల్మ్‌షోలు, ఫ్లవర్‌షోలు, పిల్లలకు పలు రకాల పోటీల నిర్వహణ, నమూనా దేవాలయాలు, కల్చరల్ ప్రోగ్రామ్‌లు ఎన్నో వినోద, విజ్ఞాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్సవాలలో బంపర్‌డ్రా నిర్వహించడం జరుగుతుందని, అందులో మొదటి బహుమతిగా కారు, 2వ బహుమతిగా ద్విచక్ర వాహనం, 3వ బహుమతిగా లేడీస్ పర్స్ అందించబడతాయన్నారు. వివిధ రంగాలలో నిష్ణాతులైన విశిష్ట వ్యక్తులను ఎంపిక చేసి, రాష్ట్ర స్థాయిలో అధికారులతో సంప్రదించి ఎవరెవరికి పురస్కారాలు ప్రదానం చేయాలో నిర్ణయించడం జరుగుతుందన్నారు.

తరువాయి 2లో..

# దేశంలో దొంగలు పడ్డారు

## ఏపీ బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ



ఢిల్లీ: రాఫెల్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఇకనైనా ప్రతిపక్షాలకు కనువిప్పుకలగాలని ఏపీ బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు. రాఫెల్ పిటిషన్లను సుప్రీంకోర్టు తిరస్కరిస్తూ శుక్రవారం ఇచ్చిన తీర్పుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. దీనిపై మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ నేత కుటుంబరావు పెద్ద స్కాం బయటపెడతానని చెప్పి లేని కుంభకోణాన్ని సృష్టించారని అన్నారు. ఏనుగు పోతుంటే కుక్కల మొరుగుతుంటాయని ఎద్దేవా చేశారు. తెలుగుదేశం పార్టీ

తరువాయి 2లో..

### రఫేల్ ఒప్పందంపై

# దర్యాప్తు అవసరం లేదు

## మోదీ ప్రభుత్వానికి సుప్రీం క్లీన్ చిట్



ఢిల్లీ: దేశ రాజకీయాల్లో వివాదాలకు కేంద్రబిందువుగా మారిన రఫేల్ ఒప్పందంపై సుప్రీంకోర్టులో కేంద్రానికి ఊరట లభించింది. ఫ్రాన్స్ నుంచి 36 రఫేల్ యుద్ధ విమానాలు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్న మోదీ ప్రభుత్వానికి సర్వోన్నత న్యాయస్థానం క్లీన్‌చిట్ ఇచ్చింది. ఈ మేరకు రఫేల్ ఒప్పందంలో అవకతవకలు జరిగాయని, వీటిపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలంటూ దాఖలైన అన్ని పిటిషన్లను న్యాయస్థానం తోసిపుచ్చింది.

రఫేల్ ఒప్పంద ప్రక్రియలో అనుమానించదగ్గదేమీ లేదని చీఫ్ జస్టిస్ రంజన్ గొగొయ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తెలిపింది. ఏ దేశానికైనా యుద్ధ విమానాలు అవసరం అని, భారత వైమానిక దళంలోకి నాలుగు, ఐదో తరం యుద్ధవిమానాలను చేర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోర్టు అభిప్రాయపడింది. దేశ భద్రత దృష్ట్యా కొన్ని అంశాల్లో గోప్యత పాటించాల్సి వస్తుందని కోర్టు పేర్కొంది. రఫేల్ ఒప్పంద నిర్ణయ విధానం, ధరల వ్యవహారం, అంతర్జాతీయ ఒప్పందం వంటి అంశాల్లో న్యాయస్థానం జోక్యం చేసుకునేందుకు ఎలాంటి కారణాలు కన్పించట్లేదని కోర్టు

తరువాయి 2లో..




### ఏపీ సీఎం చంద్రబాబు

# మాయమాటలు నమ్మొద్దు



హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు టీఆర్ఎస్‌తో పొత్తుకు ప్రయత్నించి విఫలమయ్యారని వైఎస్సార్‌సీపీ నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. కేసీఆర్‌ని టీడీపీ నెత్తినపెట్టుకోవాలని చూసిందని, చంద్రబాబును ఓటుకు కోట్లు కేసులో శిక్షించి ఉంటే నేడు పరిస్థితి వేరుగా ఉండేదని అన్నారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణ ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు చంద్రబాబు ప్రయత్నించారని, దానికిప్రతిగా ఏపీ రాజకీయాల్లో వేలు పెడతానని కేసీఆర్ ప్రకటించారని.. ఇందులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఏం సంబంధం ఉందని ప్రశ్నించారు. చంద్రబాబు ఊసరవెల్లి మాటలపై ఆలోచించాలని ప్రజలను కోరారు. హరికృష్ణ చనిపోయిన సందర్భంలో టీఆర్ఎస్‌తో పొత్తుకు చంద్రబాబు ప్రయత్నించిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని చంద్రబాబు ఎంత భ్రష్టుపట్టించారో, కేసీఆర్ అంత నష్టపరిచారని విమర్శించారు. టీఆర్ఎస్ ప్రభుత్వంతో అన్ని అంశాల్లో రాజీపడింది చంద్రబాబే అన్నారు.

కేసీఆర్ యాగం చేస్తుంటే పిలవగానే ఎగేసుకుంటూ చంద్రబాబు స్వయంగా హాజరవుతారు. రాజధాని నిర్మాణ శంకుస్థాపనకు కేసీఆర్‌ను పిలుస్తారు. పరిటాల శ్రీరామ్ వివాహ సందర్భంలో అటు చంద్రబాబు ఇటు కేసీఆర్‌తో కూడిన కటౌట్లు వేసింది ప్రజలు మరిచిపోలేదు. ఇప్పుడేమో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అంటగట్టి మాట్లాడతారా? నిన్నటి వరకు బీజేపీ, పవన్ కల్యాణ్‌తో కలసిపోయామని దుష్ప్రచారం చేశారు. ఇప్పుడు చూస్తే కేసీఆర్‌తో అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు. చంద్రబాబు మాయమాటలు నమ్మొద్ద'ని బొత్స కోరారు. కేసీఆర్ విజయవాడ వచ్చినప్పుడు ఆయన కోసం ఏపీ మంత్రులు ఎందుకు క్యూ కట్టారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాలకే చంద్రబాబు

తరువాయి 2లో..



# ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలి



అనకాపల్లి : అనకాపల్లి పట్టణములో చిన్న నాల్గు రోడ్లు జంక్షన్ వద్ద సుంకర మెట్ట కళ్యాణ మండపంలో నగర దర్శని కార్యక్రమం జరిగింది. జోనల్ కమిషనర్ బి .రాము మాట్లాడుతూ, ప్రభుత్వం ఈ నాల్గున్నార సంవత్సరం లో ఎన్నో కార్యక్రమంలు చేసిందని, ప్రజలుకుడా ప్రభుత్వనికి సహకరించాలని మీ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచు కోవాలని తెలియజేసారు. అనకాపల్లి పట్టణం జ్మభూమి కమిటి సభ్యులు మళ్ళ సురేంద్ర గారు మాట్లాడుతూ నిరుపేదలు కోసం ప్రభుత్వం ఇస్తున్నా ఇల్లులుకి ఇంకా ఎవ్వరైనా మంజూరు చేసుకోపోతే ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, జరక్స్ తో స్థానిక ఎమ్మెల్యే పీలా గోవిందు సత్యనారాయణ కార్యలయం లో ఆన్ లైన్ చేసుకోవాలని తెలియ జేస్తు ప్రజా సమస్యలను పరస్కరించ డానికే ఈ నగర దర్శని కార్యక్రమం నిర్మావహిహిస్తున్నారని తెలియజేస్తూ , మొన్న ఎమ్మెల్యే నిరు పేదలకు మంజూరు చేసిన ఇల్లు పట్టాలను అంద జేయుడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిపిఆర్వో రమేష్ వార్డు నాయకులు మారిశెట్టి శంకరరావు, రేబాక ఈశ్వర అప్పారావు ,వేగి కృష్ణ, బొడ్డెటి నూక అప్పారావు, గోల్డ్ వాసు తదితరులు పాల్గొన్నారు.

# 17న భగవద్గీత శ్లోకాల పోటీలు



విజయనగరం: భగవద్గీతా జయంతిని పురస్కరించుకుని ఈ నెల 17వ తదేఈన తిరుమల తిరుపతి దేశస్థానం ఆదేశాల మేరకు టి.టి.డి , హిందూ ధర్మ పరిషత్ సంయుక్తంగా భగవద్గీతా శ్లోకాల పఠన పోటీలు నిర్వహిస్తున్నామని టి.టి.డి.ప్రోగ్రాం అసిస్టెంట్ డైరక్టర్ జె.శ్యామ్ సుందర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కార్యలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. విజయనగరం, పార్వతీపురం డివిజన్లలో పోటీలు జరుగుతాయని తెలిపారు. 6 నుండి 9 వతరగతి మధ్యలో చదువుకునే విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. విజేతలకు జూయర్.సీనియర్ విభాగతాల్లో ప్రధమ, తృతీయ, 10 కన్సులేషను బహుమతులు అందజేస్తారని, వివరాలకు టి.టి.డి సప్రదివస్త్రంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పి.నరసింహాచార్యులు, కోదండరాం, తిరుపతి రావు పాల్గొన్నారు.

## జనమంతా జగన్ సీఎం అవ్వాలని కోరుకుంటున్నారు

### వైసీపీ సమన్వయకర్త యు.వి.రమణమూర్తి రాజు (కన్నబాబు)

### కన్నబాబుకు ప్రజల నుండి మంచి స్పందన

అచ్యుతాపురం :జనమంతా జగన్ సీఎం అవ్వాలని కోరుకుంటున్నారని యలమంచిలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త యు వి రమణమూర్తి రాజు(కన్నబాబు) అన్నారు.శుక్ర వారం ఆయన మండలంలో చీమలాపల్లి ,బంగారమ్మపాలెం ,అప్పన్నపాలెం గ్రామాలలో రావాలి జగన్ కావాలి జగన్ కార్యక్రమంలో పాల్గొని వైఎస్సార్ నవరత్నాలలో అమ్మవడి ,రైతు భరోసా ,ఆరోగ్యశ్రీ ,పింఛన్ల పెంపు వంటి పతకాలు గురించి ప్రజలకు వివరిస్తు ఇంటింటి తిరిగి కరపత్రాలను పంపిణి చేశారు. ఆయన మాట్లడుతూ తెలంగాణ ఎన్నికల్లో చంద్రబాబుకు పట్టిన గతి వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోను పడుతుం దన్నారు .ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి యువనాయకులు ,మాజీ డీసీసీబీ చైర్మన్ యు సుకుమార్ వర్మ (తేజ) ,జిల్లా రూరల్ యువజన అద్యక్షులు లాలం రాంబాబు (రాము) ,మాజీ ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు ,మండలపార్టీ అద్యక్షులు మారిశెట్టి సూర్యనారాయణ ,నర్మాల కుమార్, ద్వారపురెడ్డి బాబ్జి, కొరుపోలు చిన్నారావు ,దేశంశెట్టి శంకరరావు, చేపల శ్రీరాములు, వడిశల శ్రీను ,మండల యువజన అద్యక్షులు గండిబోయిన వెంకట్, మాజీ సర్పంచ్ వాసు, బలిరెడ్డి శ్రీను, పెయ్యల గిరి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆటో కార్మికులు బాధ్యతగా ఉండాలి

### కొత్తకోట సిఐ లక్ష్మణరావు

రావికమతం : ఆటో కార్మికులు బాధ్యతగా ఉండాలని కొత్తకోట సిఐ లక్ష్మణరావు కోరారు. శుక్రవారం కొత్తకోటలో శ్రీశాంతి ఆటో యూనియన్ ఆటో కార్మికుల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిధిగా పాల్గన్న సిఐ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆటో కార్మికులు విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలన్నారు. ఆటో యూనియన్ సంఘం వారు తమకు ఎప్పుడు అందుబాటులో ఉంటే వారికి కావల్సిన సదుపాయాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మద్యం సేవించి ఆటో లను నడపరాదన్నారు. రికార్డులు సక్ర మంగా ఉండాలన్నారు. అధిక ప్రయాణి కులను ఎక్కించుకొని ప్రయాణికులను ఇబ్బం దులకు గురి చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలే టీడీపీ పార్టీకి బలం



మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షులు అప్పలనాయుడు

గొలుగొండ : సంక్షేమ పథకాలే టీడీపీ పార్టీకి బలమని మండల టీడీపీ అధ్యక్షులు అడిగర్ల అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం కొత్తజోగుంపేటలో తెలుగుదేశం పార్టీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తలు, నాయకులు, ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. బూత్ కమిటీ కన్వీనర్లకు పార్టీ నుండి మొబైల్ ఫోన్‌లు అందజేస్తారని, అందుకోసం కన్వీనర్లు అంతా జిల్లా పార్టీ కార్యాలయానికి వెళ్లి తీసుకోవాలన్నారు. నాలుగేళ్లలో గ్రామాల్లో అమలు చేసిన ప్రజాసంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుర్ల లక్ష్మీనారాయణ, మండల మాజీ సర్పంచ్‌ల సంఘంఅధ్యక్షులు సుర్ల బాబ్జి, చీడిగుమ్మల సొసైటీ అధ్యక్షులు భీమిరెడ్డి సత్యనారాయణ, సీనియర్ నాయకులు చిటికెల సాంబమూర్తి, లగుడు ధనాజీ, కొల్లి సత్తిబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# అభియోగాలను నిరూపించడంలో సాక్ష్యాల సేకరణే కీలకం

### జిల్లా ఎస్పీ జి.పాలరాజు



విజయనగరం: వివిధ పోలీసు స్టేషన్లలో నమోదై, దర్యాప్తులో ఉన్న కేసుల్లో నిందితులు శిక్షింపబడే విధంగా సాక్ష్యాలను సేకరించాలన్నారు. మాసాంతర నేర సమీక్షా సమావేశాన్ని శుక్రవారం విజయనగరం ఆర్మ్‌డ్ రిజర్వు సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ జి. పాలరాజు నిర్వహించారు. నేరం జరిగిన సమయంలో నిందితులు సంఘటనా స్థలం వద్ద ఉన్నట్లుగా రుజువు చేసే సాక్ష్యాలు తప్పనిసరిగా సేకరించాలన్నారు.కోర్టు విచారణలో ఉన్న కేసుల ప్రస్తుత వివరాలు, సమాచారాన్ని తెలుసుకొనేందుకుగాను ఈ-కోర్టు ఆప్‌ను మొబైలు ఫోనులో నిక్షిప్తం చేసుకోవా లన్నారు. డయల్-100 ఫిర్యాదులపై ఎటువంటి అలసత్వాన్ని ప్రదర్శించవద్దని, ఫిర్యాదు రాగానే సంఘటనా స్థలంకు వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాహనదారులపై గతంలో నమోదై, చలానా రుసుంలను చెల్లించకుండా ఉండే ఎం.వి. కేసుల్లో చలానా రుసుంలు వెంటనే చెల్లించే విధంగా తనిఖీలు చేపట్టాలన్నారు. వాహన తనిఖీలు చేపట్టే సమయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని,ఎటువంటి సంఘటననైనా తిప్పికొట్టే విధంగా సాయుధ బలగాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తీవ్రమైన కేసుల్లో నేరాన్ని కోర్టుల్లో రుజువు చేసేందుకు సాంకేతిక, ఫోరెన్సిక్ ఆధారాలను సేకరించాలని, నేరాన్ని చూసే ప్రత్యక్ష సాక్షులను తప్పనిసరిగా విచారించాలని, సాక్షుల విచారణను, సాక్ష్యాన్ని తప్పనిసరిగా వీడియోగ్రాఫ్ చేయించాలన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుద్యోగ యువకులను గుర్తించి, వివరాలను పంపినట్లుయితే, వారికి వృత్తి నైపుణ్యంలో మెళుకవలు, పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టనున్నట్లుగా తెలిపారు.2018-19 విద్యా సం॥కు 10వ తరగతి పరీక్షలు వ్రాయబోయే దత్తత పాఠశాల విద్యార్థులకు "ఆల్ ఇన్ ఒన్"స్టడీమెటీరియల్‌ను అందజేయ నున్నట్లు, అందుకు ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశిం చారు. పోలీసు సిబ్బంది, అధికారులు ఎవ్వరైనా క్రమ శిక్షణ ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను జిల్లా ఎస్పీ హెచ్చరించారు. అనంతరం, గత మాసంలో నమోదు అయి, దర్యాప్తులో ఉన్న కేసులను, తీవ్రమైనమరియు చిన్న తరహా కేసులను పోలీసు స్టేషన్లు వారిగా సమీక్షించి, కేసులు దర్యాప్తులో ఉండుటకు గల కారణాలును సంబంధిత పోలీసు అధికారులను అడిగి తెలుసుకొని, ఆయా కేసులలో చేపట్టాల్సిన చర్యల గురించి పోలీసు అధికారులకు జిల్లాఎస్పీ శ్రీ జి.పాలరాజు గారు తగిన సూచనలు, సలహాలను ఇచ్చి, మార్గ నిర్దేశం చేసారు.ఈ నేర సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు, ఒఎస్‌డి జె. రామ్మోహన రావు, బబ్బిలిఎఎస్పీ గౌతమీ శాలీ, విజయనగరం డిఎస్పీ డి.సూర్య శ్రావణ్ కుమార్, విజయనగరం ట్రాఫిక్ డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, సిసిఎస్ డిఎస్పీ ఎ.ఎస్. చక్రవర్తి, ఎస్సీ మరియు ఎస్టీ సెల్ డిఎస్పీలు టి. త్రినాధ్, గురుమూర్తి, మహిళా పిఎస్ డిఎస్పీ కె. కుమార స్వామి, ఎఆర్ డిఎస్పీ ఎల్. శేషాద్రి, స్పెషల్ బ్రాంచ్ సిఐలు వై.వి. శేషు, జి. రామకృష్ణ, ఎస్.కోట సిఐ బి. వెంకటరావు, విజయనగరం రూరల్ సిఐ రమేష్, భోగాపురం సిఐ శ్రీహరిరాజు, గజపతినగరం సిఐ విద్యాసాగర్, విజయనగరం 2వ పట్టణ సిఐ బి.వి.జె. రాజు, విజయనగరం 1వ పట్టణ సిఐ వి. చంద్రశేఖర్, చీపురుపల్లి సిఐ శ్యామల రావు, కొత్తవలస సిఐ ఆర్. శ్రీనివాసరావు, ఎల్విన్‌పేట సిఐ శ్రీనివాసరావు, పార్వతీపురం సిఐ రాంబాబు, బబ్బిలి రూరల్ సిఐ ప్రసాదరావు, బబ్బిలి సిఐ మోహనరావు, ఆర్ఐలు శ్రీహరిరావు, రామకృష్ణ, రమేష్, శంకర రావు, డిసిఆర్‌బి ఎస్ఐలు సుంకరి అప్పారావు, రామకృష్ణ, వివిధ పోలీసు స్టేషనులకు చెందినఎస్ఐలు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కరువు

### సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి

నర్సీపట్నం : స్వాతంత్రం వచ్చి 72 ఏళ్లు గడుస్తున్నా గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి అన్నారు. శుక్రవారం నర్సీపట్నం ఎన్జీఓ హోమ్‌లో గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు పొట్టిక సత్యనారాయణ అధ్యక్షతన గిరిజనుల అభివృద్ధిప్రభుత్వ విధానాలపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ గిరిజనులకు ప్రభుత్వం ఇస్తున్న నిధులు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. గిరిజన ప్రాంతంలో కరెంటు, నీరు, రోడ్ల సమస్యలు పూర్తి స్థాయిలో జరగడం లేదని వాపోయారు. ఇప్పటికీ మారుమూల ప్రాంతాలలో వెళ్లడానికి సరైన రహదారులు లేవని అన్నారు. సాగు భూములకు అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం కూడా పూర్తిస్థాయిలో అందని పరిస్థితి ఉందన్నారు. వైద్యం సకాలంలో అందక గిరిజన మరణాలు ఎక్కువయ్యాయన్నారు. రంపచోడవరం గ్రామంలో పది మంది జ్వరాలు వచ్చి మృతి చెందటం జరిగిందని, వారికి సరైన వైద్యం, సరైన రవాణా సౌకర్యం లేక రహదారులు లేకనే ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. గిరిజన వాసులకు మినీ ఐటిడిఏ ఏర్పాటు చేయాలని కోరారు. విశాఖపట్నం లో డిసెంబర్ 21 జరిగే బహిరంగ జాతీయ సదస్సు జయప్రదం చేయాలని అధిక సంఖ్యలో పాల్గనాలని కోరారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కూడా భూషణరావు, సిపిఐ జిల్లా కార్య దర్శి బాలేపల్లి వెంకటరమణ, జిల్లా గిరిజన ప్రధాన కార్యదర్శి మొట్టడం రాజబాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడు మాకిరెడ్డి రామునాయుడు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు, వ్యవసాయ కార్మిక సంఘు జిల్లా అధ్య క్షులు శివలంక కొండలరావు, జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి జి.గురుబాబు, పట్టణ కార్యదర్శి రుత్తల పెద్ద బుజ్జి, గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి

మొదటి పేజీ తరువాయి

## విశాఖ ఉత్సవ్‌ను విజయవంతం చేయండి

పర్యాటకులు, ఆహ్వానితులు ఇబ్బంది పడకుండా ఆర్టీసి సేవలు వినియోగించుకోవాలన్నారు. విశాఖ ఛిల్డ్రన్ థియేటర్‌లో విశాఖలో చిత్రీకరించిన సినిమాలు ప్రదర్శనకు అవకాశముంటుందన్నారు. విశాఖ సెంట్రల్ పార్క్‌లో సందర్శకులనాకర్శించేందుకు ఫ్లవర్ షోను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈప్రదర్శన మాత్రం వారం రోజులపాటు కొనసాగేలా చూస్తామన్నారు. ఈ ఉత్సవాల ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్నందున గట్టి భద్రతా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. విశాఖ ప్రజలకు ఈ ఉత్సవాలను అంకితం చేస్తూ గీతాలాపన ఉంటుందన్నారు. ముందుగా ఉత్సవ్ నిర్వహణపై మంత్రి అధికారులతోనూ, ట్రాన్స్‌పోర్ట్, శానిటేషన్, పర్యాటక శాఖ అవసరాలు దృష్టిలోపెట్టుకుని ఎవరికీ ఇబ్బంది లేకుండా జివిఎంసి, వుడా, ఇతర అధికారులు సమన్వయంతో పనులు సాగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి విఎంఆర్‌డిఎ 3వ అంతస్తులో విశాఖ ఉత్సవ్ మీడియా సెంటర్‌ను ప్రారంభించారు. రీజనల్ డైరెక్టర్ టూరిజం వివిధ కమిటీల ఏర్పాటు కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, జాయింట్ కలెక్టర్ జి. సృజన, శాసనసభ్యులు పల్లా శ్రీనివాస్, విఎంఆర్‌డిఎ వైస్ చైర్మన్ బసంత్ కుమార్, జివిఎంసి మరియు పలువురు జిల్లా అధికారులు, ఇ-ఫ్యాక్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ముంచుకొస్తున్న ముప్పు

గురించి అధికారులతో సమీ నిర్వహించారు. తుపాను సంబంధిత విభాగాల అధికారులు ఆర్టీజీఎస్‌లో అందుబాటులో ఉండాల్ని ఆదేశించారు. తుపాను పరిస్థితిని ప్రభుత్వ ప్రధాన కార్యద్శి అనిల్‌చంద్ర ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఆర్టీజీఎస్‌తో సమన్వయం చేసుకుని తుపాను పరిస్థితులను ఎదుర్కోవాల్ని సీఎం సూచించారు. తుపాను నేపథ్యంలో రాత్రిపూట కూడా ధాన్యం కొనుగోలు చేయాలని పౌరసరఫరాల శాఖను ప్రభుత్వం ఆదేశించింది. ఆర్టీజీఎస్‌లో తుపాన్ ప్రిస్థితి ఎదుర్కోవడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జాల్లు, రైతులు, ఆయా జిల్లాల అధికారులను ఆర్టీజీఎస్ నిత్యం అప్రమత్తం చేస్తూ సందేశాలు జారీ చేస్తోంది. ప్రిష్కార వేదిక 1100 కాల్ సెంటర్ నుంచి తుపాన్ జాగ్రత్తల సందేశాలు జారీ చేస్తున్నారు.

తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలను అప్రమత్తం చేసింది. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ దళాలను సిద్ధం చేసింది. ఈ ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠంగా 20 సెం.మీ వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఆర్టీజీఎస్ తెలియజేసింది. తీసుకోవాల్సిన చర్యలపై శాఖల వారీగా సమాచారం అందించినట్లు విపత్తు నిర్వహణ శాఖ కమిషనర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. ఈ నెల 13 నుంచి 16 దాకా సముద్రం అల్లకల్లోలంగా ఉంటుంది. దక్షిణ కోస్తా తీర ప్రాంత జిల్లాల్లోని మత్స్యకారులు వెళ్లకూడదు. వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే తీరానికి చేరుకోవాలని అధికారులు సూచనలు చేశారు. తుపాను వచ్చే జిల్లాల్లో ఎం.ఎల్.ఎస్. కేంద్రాల వద్ద నిత్యావసర సరుకులను సిద్ధం చేసి ఉంచుతున్నారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే రేషన్ డీలర్లు వాటిని తక్షణమే పంపిణీ చేయడానికి వీలుగా చర్యలు చేపట్టారు.

***16, 17 తేదీల్లో భారీ వర్షాలు..***

తుపాను హెచ్చరికలతో కృష్ణా జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ నెల 16 ,17 తేదీల్లో భారీ వర్షాలకు అవకాశం ఉందని హెచ్చరికలు అధికారులు జారీ చేశారు. సముద్ర తీరంలోని ఆరు మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించారు.

## ఈ నెల 15న డల్లాస్‌లో జనసేన 'ప్రవాస గర్జన'

సమావేశం అవుతున్నారు. డిసెంబర్ 15 సాయంత్రం 5.30 నుంచి రాత్రి 11.30 వరకు డల్లాస్ లో ఈ 'జనసేన ప్రవాస గర్జన' సభ జరగనుంది. డల్లాస్ లోని టయోటా మ్యూజిక్ ఫ్యాక్టరీలో ప్రవాస గర్జనకు సంబంధించి ఎన్నారైలు భారీ ఏర్పాట్లు చేశారు. గర్జనకు దాదాపు 10వేలమంది వస్తారని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. అలాగే గర్జనకు ముందు డల్లాస్‌లో భారీ ర్యాలీ చేపట్టేందుకు ఎన్నారైలు, జనసైనికులు సిద్ధమవుతున్నారు. దాదాపు వెయ్యి కార్లతో ఈ ర్యాలీని ప్లాన్ చేస్తున్నారు.

మరోవైపు గర్జన సందర్భంగా జనసైనికులల్లో ఊపుతెచ్చేందుకు 'రా సైనికా' అనే వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. యువ సంగీత దర్శకుడు సాయి కార్తీక్ కంపోజ్ చేసిన ఈ సాంగ్‌కు రామజోగయ్య శాస్త్రి అదిరిపోయే లిరిక్స్ అందించారు. ఇందులో జనసేనానిగా పవన్ ప్రజల కోసం చేసిన పోరాటాలను విజువల్‌గా చూపించారు. ఉద్దానం కిడ్నీ సమస్య, రాజధాని భూములు, ప్రత్యేక హోదా తదితర అంశాలను ప్రస్తావించారు. జనసేన పార్టీ స్థాపన నుండి ఇప్పటి వరకూ పవన్ ప్రసంగాలకు సంబంధించిన కీలక ఘట్టాలను చూపించారు. చివర్లో 'జనసేన ప్రవాస గర్జన'డల్లాస్‌లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

## దేశంలో దొంగలు పడ్డారు

పెద్ద డ్రామా కంపెనీ. ఆ కంపెనీకి డైరెక్టర్ చంద్రబాబు నాయుడు. ఆయన గురించి పట్టించుకోవడానికి ప్రజలు సిద్ధంగా లేరు. దేశంలో దొంగలు పడ్డారు. వాళ్లతో జాగ్రత్తగా ఉండాలి. కొందరు బురదలో దొర్లి దానిని ఇతరులకు అంటిచాలని ప్రయత్నిస్తున్నారు. చంద్రబాబుతో కాంగ్రెస్ పార్టీ స్నేహం చేస్తే తెలంగాణలో చేతులు కాలినట్లు మళ్లీ కాల్చుకుంటారు. కాంగ్రెస్ పార్టీ ఆయన పట్ల జాగ్రత్తగా ఉండాలి. కాపు, వాల్మీకి రిజర్వేషన్ల గురించి కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్, జయల్ ఓరంతో చర్చించాము. చంద్రబాబు వారిని ఏవిధంగా మోసం చేశాడో వివరించాము. త్వరలో రిజర్వేషన్లపై క్లారిటీ వస్తుంది అని అన్నారు.

## రఫేల్ ఒప్పందంపై దర్యాప్తు అవసరం లేదు

తెలిపింది. ఈ ఒప్పందం 2016 సెప్టెంబర్‌లో జరిగినప్పుడు ఎలాంటి అనుమానాలు రేకెత్తలేదని కేవలం ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు హోలన్ వ్యాఖ్యలు చేసిన తర్వాతే దీనిపై వివాదం మొదలైందని కోర్టు పేర్కొంది. ఆయన చేసిన వ్యాఖ్యలను న్యాయవిచారణకు స్వీకరించలేదని కోర్టు తెలిపింది. అంతేగాక .. ఈ ఒప్పందంలో ప్రయివేటు సంస్థకు వాణిజ్య లబ్ధి చేకూరుతుందని చెప్పేలా సాక్ష్యాలేమీ లేవని న్యాయస్థానం పేర్కొంది. రఫేల్ ఒప్పందంతో కేంద్ర ప్రభుత్వం భారీ కుంభకోణానికి పాల్పడిందంటూ గత కొంతకాలంగా కాంగ్రెస్ ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రఫేల్ యుద్ధవిమానాల ఒప్పందంపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తునకు ఆదేశించాలంటూ యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరీ, న్యాయవాది ఎంఎల్ శర్మ తదితరులు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి నేతృత్వంలోని ధర్మాసనం నవంబర్ 14న తీర్పును రిజర్వ్‌లో పెట్టింది. తాజాగా ఈ పిటిషన్లను కొట్టివేస్తూ ధర్మాసనం తీర్పు వెలువరించింది.

## ఏపీ సీఎం చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దు

ప్రాధాన్యత ఇస్తారని మండిపడ్డారు. మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ గెలవడానికి తాను చేసిన కృషే కారణమన్న చంద్రబాబు మాటలు వింటుంటే నవ్వొస్తుందన్నారు. లగడపాటి ఒక బ్యాంక్ కరప్ట్ అని, సర్వే పేరుతో తెలంగాణ ఎన్నికల్లో ప్రజలను నట్టేట ముంచారని దుయ్యబట్టారు. మనిషి బలహీనతతో ఆడుకోవడం లగడపాటికి అలవాటని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఉనికి లేకుండా చేయాలని కుట్రలు పన్నారని ఆరోపించారు. చంద్రబాబు తన సీఎం కుర్చీని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీకి పార్టీ ప్రయోజనాలకంటే ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలే ముఖ్యమని, రానున్న ఎన్నికలలో ఎవరితోనూ పొత్తు పెట్టుకోబోమని స్పష్టం చేశారు.

***పవన్ మానసిన స్థితి బాగోలేదు..***

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మానసిక స్థితి బాగోలేదని బొత్స సత్యనారాయణ ఎద్దేవా చేశారు. ఆయన ఎప్పుడు ఎలాంటి వ్యాఖ్యలు చేస్తుంటారో ఎవరికీ అర్థం కాదని, పవన్ మాట్లాడిన ప్రతి మాటకి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రాజకీయ పరిపక్వత లేనివాళ్లు పవన్‌లా మాట్లాడతారని, రాజకీయమంటే సినిమా డైలాగులు చెప్పినట్లు కాదని హితవు పలికారు.

# 10 రోజుల వరకూ కోడిగుడ్ల వినియోగంపై నిషేధం



భువనేశ్వర్ : పూరీ జిల్లా కృష్ణప్రసాద్ ప్రాంతంలో ఉన్న కోళ్లఫారాలకు చెందిన వేలాది కోళ్లను పశుసంవర్ధకశాఖ సిబ్బంది చంపేశారు. జిల్లా ప్రధాన పశు సంవర్ధకశాఖ అధికారి గిరిజా పట్నాయక్ మాట్లాడుతూ వ్యాధి ప్రబలిన 10 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఫారా లలో కోళ్లను చంపేందుకు నిర్ణయించామన్నారు. ఇందుకోసం 8 బృందాలు ఏర్పాటు చేశామని చెప్పారు. వీరు కోళ్లను చంపేసి కాల్చిన తర్వాత పూడ్చిపెడుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతాల్లో కోడిమాంసం విక్రయ దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు.

## మౌలిక వసతుల కల్పనతో
# వార్డు సమస్యల పరిష్కారం

**రాష్ట్ర గొర్రెల మేకల ఫెడరేషన్ డైరెక్టర్ గంకల అప్పారావు**

కంచరపాలెం: వార్డులో గల సమస్యల పరిష్కారానికి ముందుగా మౌలిక వసతుల కల్పనతో వార్డు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు 37వ వార్డు అధ్యక్షుడు మరియు రాష్ట్ర గొర్రెల మేకల ఫెడరేషన్ డైరెక్టర్ గంకల అప్పారావు తెలిపారు. శుక్రవారం 37 వార్డు పరిధిలో గల శ్రీనివాసనగర్ బూత్ కన్వీనర్ గురు ఈశ్వరరావు ఇంటివద్ద తెలుగుదేశంపార్టీ వార్డు కమిటీ సమావేశం జరిగినది . ఈ కార్యక్రమంలో ముందుగా స్వర్గీయ అన్న నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళు లర్పించారు , అనంతరం గంకల అప్పారావు మాట్లాడుతూ వార్డులో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని మరింత శ్రద్ధ వహించి ప్రతి బూత్ ఇన్చార్జి శరవేగంగా పనిచేయాలని కోరారు . వార్డులో గల పారిశుధ్య ,మంచి నీటి, విద్యుత్ ,సమస్యల గురించి చర్చించారు . ఈ కార్యక్రమ లో వార్డు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ,మహిళలు ,గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

## 17 నుంచి ఆరోగ్య వాలంటీర్ల రిలే దీక్షలు

కొయ్యూరు: పాడేరు ఐటిడిఎ కార్యాలయం ఎదుట ఈ నెల 17 నుంచి రిలే దీక్షలు నిర్వహించనున్నట్లు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల ఆరోగ్య వాలంటీర్ల సంఘం జిల్లా నాయకులు నర్సీ కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ నుంచి తాము విధులు నిర్వహిస్తున్నామని, ఇంత వరకు నియామక పత్రాలు ఇవ్వలేదని చెప్పారు. తమ సమస్యల పరిష్కారానికి రెండు సార్లు ఆందోళన చేశామని చెప్పారు. పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన అధికారులు, ఎమ్మెల్యే తర్వాత పట్టించుకోవడం మానేశారని చెప్పారు. ఆరు నెలులుగా జీతాలు లేకుండా భార్య పిల్లలతో ఎలా బతకాలో అధికారులు చెప్పాలన్నారు. కలెక్టర్‌ను కలిపినా ఫలితం లేకపోయిందని, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రావణ్‌నుకలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. మంత్రి నుంచి ఇంత వరకు ఎలాంటి ప్రకటన వెలువడలేదని చెప్పారు. అందువల్ల రిలే దీక్షలు చేపట్టనున్నామని చెప్పారు.

## మరుపాకలో కుక్కల బెడద

రావికమతం: మండలంలోని మరుపాక గ్రామంలో వీధికుక్కలు రెచ్చిపోతున్నాయి. వీధి కుక్కలను నియంత్రించాలని పలుమార్లు అధికార్లకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఫలితంగా గురువారం వీధికుక్కల దాడిలో రెండు లేగ పెయ్యిలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన సుంకర వీర్రాజు, రాయి సోమునాయుడుకు చెందిన పెయ్యిలు పశువుల పాకల వద్ద ఉండగా వాటిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయ పరిచాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కలను నివారించాలని కోరుతున్నారు.

## భారతీయ సంగీతానిది ప్రత్యేక స్థానం

**వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు**

ఆంధ్ర విశ్వకళాపరిషత్ : భారతీయ సంగీతానిది ప్రత్యేక స్థానమని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. శుక్రవారం ఉదయం ఏయూ సంగీత విభాగంలో నిర్వహిస్తున్న ప్రభాతసంగీత కార్యశాలను ఆయన ప్రారంభించారు. ఏయూ సంగీత విభాగం, ప్రభాత రీసెర్చ్ ఫౌండేషన్, రినైనెన్స్ యూనివర్సల్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. అనంతరం మాట్లాడుతూ ఆధ్యాత్మిక వేత్తగా విభిన్న భాషల్లో ప్రభాత్ రంజన్ సర్కార్ రచనలు చేసారన్నారు. ప్రభాత సంగీత అరుదుగా జరిగే కార్యక్రమమన్నారు. ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం ఎచేసుకోవాలని సూచించారు.

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.రామ మోహన రావు మాట్లాడుతూ జీవాత్మను, పరమాత్మను అనుసంధానింప చేయడానికి సంగీతం సాధనంగా నిలుస్తుందన్నారు. విభిన్న శాస్త్రాలపై అపార జ్ఞానం కలిగి ఉండి విభిన్న భాషల్లో రచనలు చేయడం ఎంతో అభిలషనీయమన్నారు. సమాజానికి విలువైన అంశాలు ప్రభాత సంగీతంలో ఉంటాయన్నారు. ఈ రచనలను వినియోగించుకుంటూ సమాజం లబ్ధి పొందాలని సూచించారు.

ఆనంద్‌మార్గ్ ప్రచారక సంఘం జనరల్ సెక్రటరీ ఆచార్య భవేశానంద మాట్లాడుతూ భగవదాంశతో జన్మించిన వ్యక్తులు కొందరుంటారని వారిలో ప్రభాత్ రంజన్ సర్కార్ ఒకరన్నారు. ఆయన విజ్ఞానం ఒక ప్రవాహాన్ని తలపిస్తుందన్నారు. ఆయన రచించి, స్వరపరచిన 5018 రచనల్లో ఆధ్యాత్మికత, ప్రకృతి, మానవ జీవనం, పండుగలు వంటివి మనకు దర్శనమిస్తాయన్నారు. వీటికి అవసరమైన స్వరాలను సైతం ఆయన ఇవ్వడం జరిగిందన్నారు.

సంగీత విభాగాధిపతి ఆచార్య సరస్వతి విద్యార్థి మాట్లాడుతూ విభాగంలో సదస్సుల నిర్వహణకు అవసరమైన సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేసి అందించిన వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సంగీత కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రినైసెన్స్ యూనివర్సల్ కార్యదర్శి నారాయణ పాండా, ఆనంద్ అభిష ఆచార్య, డి.దేబ్‌నాధ్, ఎస్.హల్దార్, ఆచార్య దివ్యచేతనానంద అవధూత తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## గిరిజన కుటుంబాలను
# ఆదుకోవడం కోసం ఎన్నో పథకాలు



కొయ్యూరు : పేద గిరిజన కుటుంబాలు ఆదుకోవడం కోసం అనేక అభివృద్ధి పథకాలు ప్రతీ పంచాయతీలో ప్రవేశ పెడుతున్నామని ఎంపిడిఒ షేక్ రహమాన్ అన్నారు. శుక్రవారం మండలంలోని గద బపాలెం గ్రామ పంచాయతీలో గ్రామ దర్శిని కార్యక్రమం నిర్వహి ంచిన మండల అధి ,కారులు గ్రామ స్థులతో సమావేశ మయ్యారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులు జోగుంపేట రోడ్డు నుంచి మర్రిపాలెం వయా చిట్టింపాడు, గదబపాలెం మీదుగా వెళ్లే రహదారిని అభివృద్ధి చేయాలని కోరారు.

## ప్రమాదకరంగా గోతులు

యలమంచిలి రూరల్: 15 రోజులుగా పైపులైన్ కొరకు ఏర్పాటు చేసిన గుంతలను పూడ్చకపోవడంతో పలువురు గాయాలపాలవుతున్నారు. యలమంచిలి గాజువాక బైపాస్ రోడ్డులో తాగునీటి పైపులైన్ కోసం ఏర్పాటు చేసిన గోతిలో పడి గురువారం సైకిల్‌పై పాఠశాలకు వెళుతున్న బాలుడు ప్రమాదవశాత్తు గోతిలో పడిపోయాడు. ఈ ప్రాంతంలో రైతులు పగలనక రాత్రనక ఈ మార్గంగుండా ప్రయాణిస్తుంటారు. ద్విచక్ర వాహనదారులు తిరిగే అవకాశం ఎలాగూలేదు. ఇప్పటికైనా గోతులను పూడ్చాలని కోరుతున్నారు.

## నేడు జయహో బిసి సమావేశం

రోలుగుంట: రోలుగుంటలో చోడవరం నియోజకవర్గం స్థాయిలో జయహో బిసి సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గండి సింహాద్రి, గుములూరి చంద్రమౌళి తెలిపారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. స్థానిక జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న విశాలమైన స్థలంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని నియోజకవర్గంలో గల నాలుగు మండలాల నుంచి బిసికి చెందిన ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరు కావాలని వారు కోరారు.

## మార్గశిర మాసోత్సవాలకు
## భక్తుల తాకిడి



బురుజుపేట: ఉత్తరాంధ్ర ప్రజల కొంగుబంగారమైన శ్రీ కవక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మార్గశిర మాసోత్సవాలు ఘనంగా నిర్వహించబడుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం అమ్మవారి నవావరణార్చన, లక్ష్మీహెూమం, వేదపారాయణ, సప్తశతీ పారాయణ, మహావిద్యా పారాయణ తదితర వేద కార్యములు ఘనంగా నిర్వహించుట జరిగినదని ఆసయ కార్యనిర్వహణాధికారి మాధవి పేర్కొన్నారు. ఉదయం అమ్మవారికి జరిగిన క్షీరాభిషేకంలో 30 మంది ఉభయ దాతలు పాల్గొన్నారని తెలిపారు. ఆరోజు అన్నదాన కార్యక్రమంలో సుమారు 2500 మంది పైచిలుకు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో కె. యాలజాక్షి బృందంచే నిర్వహింపబడిన కూచిపూడి నృత్యం పలువురు ఆహూతులను అలరించిందని కార్యనిర్వహణాధికారి పేర్కొన్నారు.

### ప్రశాంతి పాలిటెక్నిక్ లో నైపుణ్య అభివృద్ది శిక్షణ



అచ్యుతాపురం : స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని ఏషియన్ పెయింట్స్ హెచ్ అర్ మేనేజర్ మానిక్ ప్రారంభించారు . ఈ సందర్భమంగా ఆయన మాట్లడుతూ ఏషియన్ పెయింట్స్, హెడ్ హెల్డ్ హై సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కోర్స్ ను 6 నెలల కాల వ్యవధికి గాను ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు .ఈ శిక్షణలో నైపుణ్యం కనబరిచిన వారికి ఉపాధి కలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ ,ప్రిన్సిపల్ కె శ్రీనివాసరావు ,హెడ్ హెల్డ్ హై ప్రతినిదులు పాల్గొన్నారు .

### ప్రాధమిక పాఠశాల భవనాలకు మరమ్మత్తులు

కొయ్యూరు : రాజేంద్రపాలెం ప్రభుత్వ పాఠశాల భవనాలకు మరమ్మత్తులు చేపట్టారు. పాడైన రేకులను తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని వేస్తున్నారు. హెచ్‌ఎం ఫణీంద్ర మాట్లాడుతూ రూ.12లక్షల వ్యయంతో చేపట్టిన మరమ్మత్తులు పూర్తయితే చాలా వరకు సమస్య తీరుతుందని చెప్పారు.

## నేటి నుండి మెగా టోర్నీ

విశాఖపట్నం : మండల కేంద్రంలో గల ఎన్.టి.అర్ మైదానంలో నేటి నుండి వాలిబాల్ మెగా టోర్నమెంట్ జరుగు తుంది. నియోజక వర్గ వై.యస్.అర్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ కుంభరవిబాబు ఆద్వర్యంలో జరుగుతుంది.ఈ టోర్నమెంట్ లో 100 టీమ్ లు పాల్గొంటున్నయి.మొదటి బహుమతి 50.000,రెండవ బహుమతి 25.000 మూడవ బహుమతి 15.000 రూపాయలు ప్రకటిస్తారు.



*కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖా సహాయ మంత్రి అశ్వని కుమార్ చౌబే విశాఖ పట్నం పోర్ట్ ట్రస్ట్ ను శుక్రవారం సందర్శించారు పోర్ట్ డెప్యూటీ చైర్మన్ పి. ఎల్ హరనాథ్ కేంద్ర మంత్రికి సాదర స్వాగతం పలికారు పోర్ట్ లో జరుగుతున్న కార్యకలాపాలు ఎగుమతులు దిగుమతులు సంబంధించిన విషయాలను డెప్యూటీ చైర్మన్ మంత్రికి వివరించారు పోర్ట్ కార్యకలాపాల పట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు పోర్ట్ cisf సిబ్బంది గార్డ్ ఆఫ్ హానర్ తో మంత్రి కి స్వాగతం పలికారు.*

## గ్రామదర్శిని ద్వారా సమస్యలు పరిష్కరిస్తాం



నాతవరం: గ్రామదర్శిని ద్వారా సమస్యలను పరిష్కరిస్తామని ఎంపిడిఒ ఎల్.యాదగిరీశ్వరరావు అన్నారు. గ్రామదర్శిని కార్యక్రమం లో భాగంగా శుక్రవారం చెర్లోపాలెం శివారు లక్ష్మీపురం గ్రామంలో పర్యటించారు. ముందుగా గ్రామంలోని అంగన్వాడీ, రేషన్ దుకాణం, పాఠశాలను సందర్శించారు. అనంతరం గ్రామంలో పర్యటించి గ్రామస్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపిడిఒ మాట్లాడుతూ సమస్యలు, అవసరాలను గుర్తించి వాటి పరిష్కార మార్గం చూపేందుకు గ్రామదర్శిని కార్యక్రమం చక్కని వేదిక అన్నారు. గ్రామాల్లో సమస్యలను గ్రామదర్శిని దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కనకారావు, వైద్యాధికారి అనూషరావు, మండల స్థాయి అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## లబ్దిదారులకు నేడు ప్లాట్ల కేటాయింపు

నర్సీపట్నం: లబ్ధిదారులకు ప్లాట్ల కేటాయింపు ఉత్సవం ఈ నెల 15న బలిఘట్టంలోని శివాలయం రోడ్డు పక్క దత్తాశ్రమం సమీపంలో నిర్వహిస్తున్నట్లు నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర తెలిపారు. పిఎంఎవై ఎన్టీఆర్ నగర్ నిర్మాణం ఇప్పటికే నిర్మాణం జరుగుతుందన్నారు. ఇళ్లు నిర్మించుకోవడానికి డిడిలు కట్టిన లబ్ధిదారులకు ఆన్‌లైన్ విధానం ద్వారా ప్లాట్ల కేటాయింపు అదే రోజు ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా రాష్ట్ర రోడ్లు భవనాలశాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పాల్గంటారని, కావున లబ్ధిదారులు ఈ కార్యక్రమంలో పాల్గని విజయవంతం చేయాలని కోరారు.

## అనకాపల్లిలో 16న
# చాగంటి ఆధ్యాత్మిక ప్రవచనలు



అనకాపల్లి : పట్టణంలో వివేకానంద ఛారిటబుల్ ట్రస్ట్ వారి ఆద్వర్యంలో ఈనెల 16వ తేదీన రావుగోపాలరావు కళాక్షేత్రంలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు బ్రహ్మశ్రీ శ్రీ చాగంటి కోటీశ్వరరావుచే మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిధిదేవోభవ అనే అంశాలపై అధ్యాత్మిక ప్రవచనం ఏర్పాటు చేయడం జరిగిందని, వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కెవి విష్ణుమూర్తి, డాక్టర్ కెవి సత్యవతి శుక్రవారం తెలిపారు. స్దానిక విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖ ఆద్యాత్మిక ప్రసంగీకులు బ్రహ్మశ్రీ చాగంటి కోటీశ్వరావు తనకు భగ వంతుడు ఇచ్చిన ఆధ్యాత్మిక ప్రవచనాలపై ఎందరో ప్రజల మన్ననలు అందుకున్నారన్నారు. అద్యాత్మికంగా, ఎన్నో ప్రముఖ దేవాలయాల్లో శివరాత్రి మహోత్సవాలు, కార్తీకమాసాలు, హిందూ దేవీ దేవతల ప్రవచనాలతో, ఎందరో హృదయాలను దోచుకున్న చాగంటి కోటీశ్వరరావు తొలిసారిగా అనకాపల్లి అద్యాత్మిక ప్రవచన కార్యక్రమానికి వస్తున్న సందర్భంగా పట్టణ ప్రజలందరూ కుటుంబ సభ్యులతో ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ తరపున ఆమె విజ్ఞప్తి చేసారు.

ఈ కార్యక్రమంలో రామచంద్ర మిషన్ సభ్యులు విల్లూరి రెడ్డమ్మనాయుడు, రిటైర్డ్ ప్రధా నోపాధ్యాయులు కర్రి బెనర్జీ, తదితరులు పాల్గొన్నారు.



*ప్రకాశం జిల్లా మార్కాపురం లో యన్. ఎస్ విద్యాసంస్థల నూతన కళాశాల ప్రారంభోత్సవం గావించిన విశాఖ శ్రీశారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్రసరస్వతీ మహస్వామివారు.*

## సమస్యల సత్వర పరిష్కారానికే గ్రామదర్శిని

**శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కె ధనుంజయ రెడ్డి**



శ్రీకాకుళం : శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలంలోని టెక్కలి పాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామదర్శిని కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె ధనుంజయ రెడ్డి పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరించేందుకు కోసమే ఈ గ్రామ దర్శని ఈ కార్యక్రమం ప్రతి గురువారం, శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మండల స్థాయి అధికారులు అంతా మీ గ్రామానికి వచ్చి మీతో మాట్లాడి గ్రామాల్లో ఇప్పటి వరకు పరిష్కారం కాని సమస్యలు తెలుసుకొని వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుం టామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు డిఆర్డిఎ పిడి కిషోర్ కుమార్, తహశీల్దార్ కె ప్రవల్లిక ప్రియ, ఎంపీడీవో పి వాసుదేవరావు, వ్యవసాయ శాఖ ఏడి జి సత్యవతి తదితర అధికారులు ఉన్నారు. అనంతరం శ్రీముఖలింగంలోని శ్రీ ముఖ లింగేశ్వర స్వామిని దర్శించి పూజలు నిర్వహించారు. శ్రీముఖి లింగేశ్వర ఆలయం చుట్టూ 40 అడుగుల వెడల్పుతో నిర్మించనున్న మాడ వీధులను ఆయన పరిశీలించారు. మాడ వీధుల నిర్మాణానికి అన్ని అడ్డంకులను అధిగమించాలని అధికారులను ఆదేశించారు.

# విజయభాను

## సంపాదకీయం

## ఎదురు దెబ్బ

మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించటం ద్వారా కాంగ్రెస్ కొత్త జవసత్వాలను పొందింది. అనుభవంలేని రాజకీయ నేత రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం ఇక అసంభవమే అన్న వారి అంచనాలు తారుమారయ్యాయి. ఇప్పటిదాకా తనకు ఎదురే లేదన్నరీతిలో వ్యవహరించిన బీజేపీకి ఎదురు దెబ్బ తగిలింది. జాతీయ రాజకీయాలపై తీవ్రంగా ప్రభావితం చేయగల హిందీ భాషా రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకోవటం 2019 సాధారణ ఎన్నికలకు దిశానిర్దేశనం చేయటమే కాదు, ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయనటంలో సందేహం లేదు. ఛత్తీస్‌గఢ్‌లో మూడింట రెండొంతుల స్పష్టమైన మెజారిటీ సాధించిన కాంగ్రెస్ బీజేపీ ఆధిపత్యానికి చరమగీతం పాడింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలో ప్రభుత్వాలు ఏర్పాటు చేయటానికి సమాయత్తమవుతున్నది. అయితే ఈ మూడు రాష్ట్రాల్లో బీజేపీ పరాజయం పాలుకావటం, కాంగ్రెస్ గెలుపు బాట పట్టడం వెనుక కాంగ్రెస్ కూడదీసుకున్న శక్తియుక్తుల కన్నా, బీజేపీ అనుసరించిన ఆధిపత్య, ఒంటెద్దు పోకడలే కారణమన్నది మరువరాదు. అనేక సందర్భాల్లో అందివచ్చిన అవకాశాలను కాంగ్రెస్ జారవిడుచుకున్నది. తద్వారా వరుస ఓటములు మూటగట్టుకున్నది. సుదీర్ఘ చరిత్ర కలిగిన కాంగ్రెస్ గత అనుభవాల ప్రాతిపదికన భవిష్యత్‌ను చక్కగా తీర్చిదిద్దుకుంటే మళ్ళా ప్రబలమైన జాతీయ శక్తిగా నిలువగలుగుతుంది. కాంగ్రెస్ పార్టీ కాలానుగుణంగా మార్పు చెందకపోవటం, విధానపరమైన నిర్ణయాల్లో కాలం చెల్లిన పద్ధతులనే అనుసరించటం ద్వారా రాష్ట్రాల్లో అధికారం చేజార్చుకున్నది. తమిళనాడులో నైతే 51ఏండ్లుగా కాంగ్రెస్ జాడలేదు. బెంగాల్ లో 41ఏండ్లు, ఉత్తరప్రదేశ్‌లో 29, బీహార్‌లో 28, గుజరాత్‌లో 23, ఒడిషాలో 18ఏండ్లుగా కాంగ్రెస్ అధికారం కోల్పోయింది. తిరిగి ఆ రాష్ట్రాల్లో పాదుకొనటానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయనేది ఊహకు అందనిదై పోయిం ది. ఇప్పుడు ఈ మూడు రాష్ట్రాల విజయాల్లో కాంగ్రెస్‌కు అనేక అంశాలు కలిసి వచ్చాయి. సుదీర్ఘకాలంగా ఈ రాష్ట్రాల్లో బీజేపీ ఏలుతున్నది. దీంతో ప్రభుత్వ వ్యతిరేకత కాంగ్రెస్‌కు బాగా కాలిసి వచ్చింది. అలాగే మున్నెన్నడూ లేని విధంగా కాంగ్రెస్‌లోని పాతతరం, యువ నాయకత్వం సమన్వయంతో కలిసి నడువటం కూడా కాంగ్రెస్‌కు సంపూర్ణ బలం చేకూరింది. మధ్యప్రదేశ్‌లోనూ, రాజస్థాన్‌లోనూ నాయకత్వమంతా ఏకతాటిపై నడువటంతో కాంగ్రెస్ పూర్వ వైభవం సంతరించుకుని, విజయతీరాలకు చేరింది. ఈ క్రమంలోనే బీజేపీ నాయక త్వం చేసిన తప్పిదాలు ప్రజల ఆగ్రహానికి కారణమయ్యాయి. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి రైతుల సంక్షేమం కోసం ఎంతో చేయటానికి ప్రయ త్నించినా, మందసార్‌లో రైతులపై జరిపిన కాల్పులు బీజేపీకి శాపంగా మారాయి. బీజేపీకి రైతు వ్యతిరేక పార్టీగా ముద్రపడింది. రాజస్థాన్ విషయానికి వస్తే అక్కడ అప్పుడప్పుడు హిందూత్వ శక్తుల దాడులు ప్రజలను భీతావహులను చేశాయి. స్థానిక నాయకత్వానికి తోడు కేంద్ర నాయకత్వం అనుసరించిన మెజారిటీవాద హిందుత్వ ప్రకటనలు ప్రజల్లో అభద్రతను పెంచాయి. ఇలాంటి సామాజిక పరిస్థితులను చూసినప్పుడు, వీటిని సానుకూల పరిస్థితులుగా మల్చుకోవటంలో కాంగ్రెస్ అనుకున్నంతగా ఫలితం సాధించలేదనే భావనలూ ఉన్నాయి.

మూడు రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రుణమాఫీ హామీ ని ప్రధాన ఆయుధంగా ప్రయోగించారు. వ్యవసాయాధారిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలోని రైతులు తీవ్ర సంక్షోభ పరిస్థితుల్లో ఉన్నారు. తాగు, సాగునీరుకు నోచుకోక, పంటలకు గిట్టుబాటు ధరలు అందక తీవ్రంగా నష్టపోయారు. ఆకలి చావులకు ఎర అయ్యారు. ఈ పరిస్థితుల నుంచి రైతులను ఆదుకునే నిర్దిష్టమైన విధానాల రూపకల్పనలో బీజేపీ ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ రుణ మాఫీ నినాదం మూలంగా రైతులు కాంగ్రెస్‌కు పట్టం గట్టారు. అయితే ఈ మూడు రాష్ట్రాల్లో రుణమాఫీకి సుమారుగా లక్షకోట్ల రూపాయలు అవసరమవుతాయని ఆర్థికవేత్తలంటున్నారు. ఇది అనుకున్నంత సులభం కాదు, దీర్ఘ కాలిక ప్రణాళిక ఉంటే అసాధ్యమేమీ కాదనే తెలంగాణ ఉదంతం ఉండనే ఉన్నది. దీర్ఘకాలిక వ్యూహాత్మక ఆర్థిక విధానాలతో చేపట్టిన కేసీఆర్ రైతు సంక్షేమ పాలనావిధానాలు ఎంతటి ప్రభావశీలంగా, సామాజిక ప్రయోజనకరంగా ఉన్నాయో కండ్లముందున్నది. కాబట్టి కాంగ్రెస్ అధికారం చేపట్టడంతోనే సరిపెట్టుకోకుండా రైతు సంక్షేమంపై దృష్టి సారించాలి. ఆ దిశగా కాంగ్రెస్ అడుగులు వేస్తేనే ఆరు నెలలలోపే వచ్చే సాధారణ ఎన్నికలకు ఆత్మవిశ్వాసంతో ముందుకు పోవటానికి అవకాశం ఉంటుంది.

# సిల్క్ షోయగం.!



విశాఖపట్నం : హస్త శిల్పి ఆర్టిషన్స్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో నగరంలోని బీచ్ రోడ్డు లోగల వై.ఎం.సి. ఏ. కాంప్లెక్స్ లోని సింపనీ హల్ లో కొలువుదీరిన సిల్క్ ఇండియా వస్త్ర ప్రదర్శనను మాజీ మిస్సెస్ వైజాగ్ - మౌనిక.పి తో పాటు కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజషన్ విశాఖ ఉమెన్స్ వింగ్ ప్రెసిడెంట్ - వినీత ప్రారంభించారు. చీర కట్టు మగువ అందానికి మరింత వన్నె తెస్తుందని మౌనిక, వినీత అన్నారు . దేశంలోని అనేక నగరాల నుండి కొలువుదీరిన విభిన్న రకాల సిల్క్ చీరలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి వారు అన్నారు. నిర్వాహకులు అభి మాట్లాడుతూ ఈ నెల డిసెంబర్ 23వ తేదీ వరకు కొనసాగుతున్న ఈ ప్రదర్శనలో చేనేతకారులు, చేతి పని బృందాలు, పట్టు సహకార సంస్థలు విభిన్న రకాల ఉత్పత్తులు 60కి పైగా స్టాల్లు లో ప్రదర్శిస్తున్నామని వివరించారు. దేశంలోని అనేక నగరాల నుంచి మైసూర్ సిల్క్ సారీస్, రా సిల్క్, కాంచీపురం ధర్మవరం, మరియు టస్సర్ వంటి వేలాది రకాల సిల్క్ చీరలు, డిజైనర్ చీరలు అందుబాటులో ఉంచామని ఆయన వివరించారు.

# రావాలి జగన్-కావాలి జగన్



విశాఖపట్నం : విశాఖ ఉత్తర నియోజవర్గం రావాలి జగన్ కావాలి జగన్ కార్యక్రమంలో భాగంగా 33 వ వార్డు గవర తాటిచెట్లపాలెం లో వార్డు కమిటి,బూత్ కన్వీనర్ మరియు బూత్ కమిటి సభ్యులుతో మీటింగ్ నిర్వహించి వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మన వై.యస్.జగన్మోహన్ రెడ్డి గారు ప్రకటించిన నవరత్నాల హామీలను మరియు ఇంటి ఇంటికి ప్రచార కార్యక్రమం ప్రాముఖ్యతను వారికి వివరిస్తున్న మన విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ కె.కె.రాజు ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు దుప్పలపూడి. శ్రీనివాస్, ఆళ్ళ శివ గణేష్,రాయుడు శ్రీను, గంగా మహేష్, నంభళ్ళ.ఈశ్వరరావు,కె.చిన్నా, ఎమ్.డి.గౌష్,ఆళ్ళ గోపి,కె.రామారావు, ఎస్.తిరుపతి, గోపి,రంజాన్ వల్లి,బి.శ్రీను,కాదర్,దుర్గా ప్రసాద్, ఏమ్.సూర్యారావు, ఎస్.స్వామి,జి.కృపారావు, సీనియర్ నాయకులు,బూత్ కన్వీనర్లు, సభ్యులు ,కార్యకర్తలు,పెద్దయెత్తున పాల్గొన్నారు.



*విశాఖ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 67వ వార్డు లక్ష్మి నగర్ ఇటీవల కాలంలో దుర్మరణం చెందిన గాడు లక్ష్మి కి చంద్రన్న బీమా పథకం ద్వారా 1,95,000/- రుపాయల ప్రొసీడింగ్స్ ను అందజేసిన ప్రభుత్వ విప్ మరియు విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి జి వి ఆర్ నాయుడు (గణబాబు)*

# మడకశిర తెదేపా ఎమ్మెల్యే రాజీనామా

అమరావతి: అనంతపురం జిల్లా మడకశిర తెదేపా ఎమ్మెల్యే ఈరన్న తన పదవికి రాజీనామా చేశారు. శు క్రవారం తన రాజీనామా లేఖను శాసనసభ కార్యదర్శి విజయ్‌రాజుకు ఆయన అందజేశారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో తప్పుడు అఫిడవిట్ దాఖలు చేసినందున హైకోర్టు ఈరన్నను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించింది. ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన వైకాపా అభ్యర్థి తిప్పేస్వామిని ఎమ్మెల్యేగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. అయితే, హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసినప్పటికీ.. ఈరన్నకు అక్కడా ఎదురు దెబ్బ తప్పలేదు.

దీంతో ఆయన ఈరోజు తన రాజీనామా లేఖను సభాపతి కోడెల శివప్రసాదరావుకు సమర్పించేందుకు శాసనసభకు వచ్చారు. అయితే, స్పీకర్ అందుబాటులో లేకపోవడంతో ఆయన సూచన మేరకు రాజీనామా లేఖను అసెంబ్లీ కార్యదర్శికి అందజేశారు.

## కవి సమయం

### మనిషి ప్రవర్తన

మంచి మనస్సు ఆలోచనా ధోరణి
సమాజ శ్రేయస్సు, పరుల హితం
పరోపకారం, క్షమాగుణం
సహనం, సర్వజీవ సమానత్వం
సాత్విక ప్రవర్తన, మితభాషణం
సజ్జన సాంగత్యం, ప్రేమతత్వం
సత్పురుషుల ఆలోచనా తత్వం
మనందరికీ స్ఫూర్తిదాయకం
కోరికలను నియంత్రించుకోవడం
అరిషడ్వర్గాలను లోబరుచుకోవడం
మానవసేవే ప్రధాన కర్తవ్యంగా
ముందుకు సాగడం అవశ్యం

...కవితా రచన
సి.ప్రతాప్
సెల్ నెం: 90636 22665

## పంచాంగం

మాసం : మార్గశిర; తిథి : అష్టమి రా. 1.44
పూర్వాభాద్ర రా. 9.54, వర్జ్యం: లేదు

శనివారం
15-12-2018

**మేషం** : ఆత్మీయుల కోసం ధనం విరివిగా వ్యయం చేయవలసి వస్తుంది. బంధువులను కలుసుకుంటారు. స్త్రీలకు షాపింగ్‌లోనూ, వాహనం నడుపు తున్నపుడు ఏకాగ్రత ముఖ్యం.నూతన పరిచయాలు, వాతావరణం సంతృప్తి నిస్తాయి.

**వృషభం** : బ్యాంకుల్లో మీ పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కో వలసి వస్తుంది. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు కలిసివస్తాయి. ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలు, ఒప్పందాల్లో మెలకువ వహించండి.

**మిధునం** :స్త్రీలకు, గృహ వాతావరణం, సంతానం వైఖరి వల్ల చికాకులు తప్పవు. కళాకారులకు, క్రీడాకారులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. పలుకుబడి కలిగిన వ్యక్తుల పరిచయం వల్ల పనులు అనుకూలిస్తాయి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణం మంచిది కాదు.

**కర్కాటకం** :విదేశీ వస్తువుల పట్ల ఆకర్షితులవుతారు. ప్రముఖులను కలుసు కుంటారు. బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. మీ సంతానం ఉన్నతి కోసం కొత్తకొత్త పథకాలు రూపొందిస్తారు. స్త్రీలలో ఒత్తిడి, హడావుడి అధికమవుతాయి.మీ స్థోమ తకు మించిన వాగ్ధానాల వల్ల ఇబ్బందుల ఎదుర్కొం టారు.

**సింహం** :పోస్టల్, కొరియర్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికమ వుతుంది. నిరుద్యోగులకు సదావకాశాలు లభించిన సద్వినియోగం చేసు కోలేరు. ఉపాధ్యాయులకు పై అధికారుల నుంచి గుర్తింపు, రాణింపు లభి స్తుంది. మీ కళత్ర మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది.

**కన్య** : కొంతమంది మీతో సన్నిహితంగా ఉంటూనే చాటుగా అపకారం తలపెట్టేందుకు యత్నిస్తారు. చిన్ననాటి మిత్రులను, ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. స్థిరాస్తిని కొనుగోలుచేయు యత్నాలు ఫలిస్తాయి. పనులు మొదట్లో మందగించినా క్రమేపీ పూర్తికాగలవు. కుటుంబీకులతో దైవ దర్శనాలు చేసుకోగలగుతారు.

**తుల** : కాంట్రాక్టర్లకు కార్మికులతో సఖ్యత నెలకొంటుంది. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. భాగస్వామి మాటతీరు, కదలికలను గమనించడం ఎంతైనా మంచిది.

**వృశ్చికం** : ఆర్థిక లావాదేవీలు, ఒప్పందాల్లో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. వృత్తిపరంగా ఎదుర్కొంటున్న ఆటంకాలు క్రమంగా తొలగి పోగలవు. ఒక్కోసారి మీ జీవిత భాగస్వామి మనస్తత్వం అర్థం చేసుకోవడం కష్ట మవు తుంది. సభలు, సమావేశాలల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు.

**ధనుస్సు** : ఫ్యాన్సీ, స్టేషనరీ, రసాయన, సుగంధ ద్రవ్య వ్యాపారులకు శు భదాయకం. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి. ఆకస్మిక ఫీజులు, బిల్లులు చెల్లిస్తారు. పట్టుదలతో శ్రమించి అనుకున్నది సాధిస్తారు. సోదరీ, సోదరులతో ఉల్లాసంగా గడుపుతారు. కుటుంబీకుల ఆరోగ్యంలో మెళకువ అవసరం.

**మకరం** : ఆర్థిక కార్యకలాపాలు సానుకూలంగా సాగుతాయి. మీ సంతానం మొండివైఖరి వల్ల చికాకులు వంటివి ఎదుర్కొంటారు. ఫైనాన్స్ వ్యాపారస్తులకు ఖాతాదారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. నిరుద్యోగులకు తాత్కాలిక అవకాశం లభిస్తుంది. పెద్దలతో కుటుంబ విషయాలు చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటారు.

**కుంభం** :కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. నిరుద్యోగులకు రాత, మౌఖిక పరీక్షల్లో ఏకాగ్రత ముఖ్యం. కుటుంబ విషయాల్లో స్త్రీలకు పట్టుదల, పంతాలు మంచిది కాదు. ఉద్యోగ స్తులకు హోదాతో పాటు బరువు బాధ్యతలు పెరుగుతాయి. ఉపాధ్యాయులకు పనిభారం అధిక మవుతుంది.

**మీనం** : గృహంలో మార్పులు, చేర్పులు అనుకూలమైన కాలం. బ్యాంకు డిపాజిట్లు, దీర్ఘ కాలిక పెట్టుబడులకు అనుకూలం. పుణ్యక్షేత్రాల దర్శనం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుంది.

# రాఫెల్ ఒప్పంద రద్దు కోసం పాకిస్తాన్ ,చైనాల నుండి కాంగ్రెస్ పెద్దలకు ఎంత ముట్టింది..?



విజయవాడ : బిజెపి రాష్ట్ర పంచాయతీ రాజ్ సెల్ కన్వీనర్ రొక్కం సూర్య ప్రకాష్ రావు శుక్రవారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాఫెల్ ఒప్పందం మీద సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు. గత ఇరవై ఏళ్ళ గా ఎంత మొత్తుకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం భారత సైన్యానికి కావలసిన ఆయుధాలను కొనుగోలు చేయలేక పోయారు. ఎప్పుడూ స్కామ్ లలో, కోర్టు కేసులలో మునిగి తేలే కాంగ్రెస్ పార్టీ సైన్యాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి దేశ భద్రత ను గాలికొదిలేసిందన్నారు.

మూడింట రెండు వంతుల ఆయుధ సామగ్రి పనికి రాకుండా పోయిందని, ఇది గమనించిన మోదీ ప్రభుత్వం ఆఘమేఘాల మీద సైన్యాన్ని బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుందన్నారు. అందులో రాఫెల్ యుద్ధ విమానాల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. పూర్తిగా నిజాయితీతో, నిబద్ధతతో పనిచేస్తున్న మోదీ ప్రభుత్వాన్ని భారత దేశంలోనే కాక, ప్రపంచ వేదికల మీద కూడా దేశం పరువు తీసే విధంగా ప్రవర్తించిన పప్పు నాయకుడు రాహుల్ గాంధీ ఇప్పుడు ఏం సమాధానం చెప్తారని నిలదీశారు. రాఫెల్ ఒప్పందంలో అవినీతి లేదని సుప్రీంకోర్టు తేల్చిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో చేసిన ఆరోపణలన్నీ అవాస్తవాలని తేలిపోయిందన్నారు. అవాస్తవ ఆరోపణలతో సాధించిన గెలుపు అనైతికమైనదని అంటూ వారు ఇప్పుడు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

వారు గత రెండు రోజులుగా రాఫెల్ ఒప్పందం పేరుతో పార్లమెంటును స్థంభింపచేస్తున్నారని అంటూ, పార్లమెంటు నడపడానికి గంటకు రెండు కోట్ల రూపాయల వ్యయం అవుతుందని ఈ లెక్కన రెండు రోజులకు అయ్యే వృధా ఖర్చును వారు భరిస్తారా అని ప్రశ్నించారు. ఇది పూర్తిగా ప్రజలు చెల్లిస్తున్న పన్నుల నుండి వ్యయం చేస్తున్నారని, దీనిపై వారు ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. రాహుల్ బావగారైన రాబర్ట్ వాద్రా, అతని మిత్రులు సంజయ్ భండారీ మోదలైన దళారీలకు ముడుపులు అందలేదు కనుక రాఫెల్ ఒప్పందం మీద ఇంత యాగీ చేశారా అని ఎద్దేవా చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ పెద్దలకు ఈ దళారీ ల నుండే కాకుండా పాకిస్తాన్, చైనా గూఢచారి సంస్థల నుండి కూడా ముడుపులు అందినట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. 1991 లో సాక్షాత్తు సోవియట్ పార్లమెంటు తమ గూఢచార సంస్థల నుండి భారతదేశానికి చెందిన నెహ్రూ గాంధీ కుటుంబ పెద్దల స్విస్ బాంకు, ఇటాలియన్ ఎకౌంట్లలో ముడుపులు జమ చేసినట్టు ఒప్పుకున్నది. కాంగ్రెస్ మంత్రి నవజోత్ సింగ్ సిద్ధు సాక్షాత్తు పాకిస్తాన్ సైన్యాధికారిని ఆలింగనం చేసుకోవడం, ఇమ్రాన్ ఖాన్ ను పొగడ్త లలో ముంచెత్తడం, కాంగ్రెస్ పార్టీ ప్రచారాలలో పాకిస్తాన్ జిందాబాద్ అని నినాదాలు చేయడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. తాత ముత్తాతల నుండి భారతదేశాన్ని తమ ప్రైవేటు ఆస్తిగా భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ దేశాన్ని ఏం చేయదలచుకుంది అని తీవ్రంగా ప్రశ్నించారు. ఈ పరిణామాలను ప్రజలు గమనించాలని కోరారు.

# రఫేల్‌పై కాంగ్రెస్ ఆరోపణలు నిరాధారమైనవే

### తాము ముందు నుంచీ చెబుతున్నామన్న రాజ్‌నాథ్

దిల్లీ: రఫేల్ ఒప్పందంలో దర్యాప్తు అవసరం లేదంటూ సుప్రీంకోర్టు వెల్లడించిన తీర్పుపై కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. కాంగ్రెస్ ఆరోపణలన్నీ నిరాధారమైనవి అని తాము ముందు నుంచీ చెబుతున్నామని, ఇప్పుడు కోర్టు కూడా అదే చెప్పిందని ఆయన అన్నారు. రఫేల్ ఒప్పందం సుస్పష్టంగా ఉంది. రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ నిరాధారమైన ఆరోపణలు చేస్తోందని మేం ముందు నుంచీ చెబుతూనే ఉన్నాం అని రాజ్‌నాథ్ అన్నారు. సుప్రీం తీర్పు సరైందికాదు.. మరోవైపు సుప్రీంకోర్టు తీర్పును పిటిషన్‌దారులలో ఒకరైన సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తప్పుబట్టారు. మా అభిప్రాయం ప్రకారం సుప్రీంకోర్టు తీర్పు పూర్తిగా తప్పు. అయినా సరే మా పోరాటం ఆగదు. దీనిపై రివ్యూ పిటిషన్ వేయాలా వద్దా అనేదానిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం అని ప్రశాంత్ భూషణ్ తెలిపారు. రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో అనుమానించదగ్గ విషయాలేవీ లేవని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

### సాలాపువానిపాలెంలో
# స్వచ్ఛసర్వేక్షన్ అవగాహన ర్యాలీ



అనకాపల్లి : 38 వార్డు సాలాపువానిపాలెం స్వచ్ఛసేర్వేక్షణ అవగాహన ర్యాలీ శుక్రవారం జరిగింది. ఈసందర్బంగా సీతారం సంకల్ప సొసైటీ అధ్యక్షులు నాగరాజు ఏపి గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ నీలబాబు మాట్లాడుతూ స్వచ్ఛ సర్వక్షన్ పై అందరూ అవగాహన కలిగి ఉండాలని పరిసరాలు పరిశుభ్రం గా ఉంచుకోవాలని కోరారు. అలాగే అనకాపల్లి స్వచ్ఛభారత్ జోనల్ కో- అడి నెటర్ దేవి సుగుణ మాట్లాడుతూ సంకల్ప సొసైటీ ఎందుకు ఏర్పాటు చేస్తున్నామంటే, సంఘము లో ఉన్నవాళ్లు బాధ్యత , మన పరిసరాలను ఏవిధంగా చూసుకోవాలి, తడి,పొడి చెత్త అంటే ఏమిటి తడి చెత్తను ఇంట్లో ఎరువుగా ఎలా తయారు చేసుకోవాలి, మొక్కలకు ఏవిధంగా ఎరువుగా వాడాలి అని ప్రశం సించారు. 2019 స్వచ్ఛసేర్వేక్షణ కోసం జీవీఎంసీ పారిశుధ్య సిబ్బం దికి సాలపువాని పాలెం ప్రజలు అందరు సహకరించాలి కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విడిఎస్ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### పరవాడలో
# చంద్రన్న బీమా అందజేత

పరవాడ: మండల కేంద్రమైన పరవాడ కోలనీలో అనారోగ్యము కారణంగా వడిశల నాయుడు మృతి చెందారు. ఆయనకు వెంటనే దహన ఖర్చులు నిమిత్తము ఐదువేలు రూపాయాలు చంద్రన్న భీమాను మండలటిడిపిప్రదానకార్యదర్శి పైల రామచంద్రరావు చేతులు మీదగా మృతుని భార్య వడిశల వరలక్ష్మికి అందజేశారు. అనంతరము అయన మాట్లడుతూ చంద్రన్నబీమా పేద ప్రజలు పాలిట గొప్పవరమని అయన అన్నారు. మిగతా లక్షతోంభై ఐదువేలు రూపాయాల ప్రొసెడింగ్ పత్రాన్ని త్వరలోనే బ్యాంక్ ఎకౌంటులో జమచేస్తామని బీమామిత్ర హేసు రత్నం తెలిపారు. ఈ కార్యక్రమంలో కోప్షన్ మెంబర్ గణపర్తిఈశ్వరావు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు రెండునిమిషాలు మౌనం

విజయనగరం: రాష్ట్ర అవతరణ కోసం 1952లో 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి అశువులు బాపిన పొట్టి శ్రీరాములు వర్థంతి సందర్భంగా 15వ తేదీ ఉదయం కలక్టర్ ఆడిటోరియంలో జిల్లా అధికారులు రెండు ఇమిషాలు మౌనం పాటించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అధికారులను,సిబ్బందిని ఆదేశించారు. ఉదయం 11 గంటలకు కలక్టర్ ఆడిటోరియంలో పొట్టి శ్రీరాములుకు నివాళులు అర్పిస్తారు.

# ప్రజాదర్బార్‌కు అనూహ్య స్పందన
**ప్రతీ క్షణం ప్రజల్లోనే ఉంటున్నాం : ఎమ్మెల్యే వాసుపల్లి**



విశాఖపట్నం : ప్రజా సమస్యల పరిష్కారంలో అహర్నిశలు శ్రమిస్తున్నట్లు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రకటించారు. విశాఖ దక్షిణం, 29వవార్డు, అచ్చియమ్మపేట ప్రాథమిక పాఠశాల సమీపంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. దీనికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. భారీగా ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాదర్బార్లో సమస్యలను సత్వరం పరిష్కరిస్తుండడంతో ప్రజల్లో అశేషమైన నమ్మకం ఏర్పడిందన్నారు. అందుకే ప్రజల నుంచి రోజు రోజుకు ఆదరణ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి సత్య నారాయణ, బర్రి కోదండం, సత్యవతి, దాసరి దుర్గారెడ్డి, ఫియాజ్ రెహమాన్, ఆలేటి వెంకటరావు, మైలపల్లి శ్రీను, కోటంశెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఛలో రాజమండ్రి
**ఎస్సీ, ఎస్టీ శక్తి ప్రదర్శన - బహిరంగ సభ**



విశాఖపట్నం : అంబేద్కర్ ఆలోచనా ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో ఈనెల 15న (నేడు) రాజమండ్రి ఆర్ట్స్ కాలేజి గ్రౌండ్‌లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఎస్సీ, ఎస్టీ శక్తి ప్రదర్శన - బహిరంగ సభను నిర్వహిస్తారని అంబేద్కర్ ఆలోచనా ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్, ఎపి స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ బైపా అరుణ్‌కుమార్ అన్నారు. ఆయన బివికె ఛాంబర్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 2019 ఎన్నికలను ఎస్సీ, ఎస్టీ ప్రజలే శాసించే దిశగా అంబేద్కర్ ఆలోచనా ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ నిర్మాణం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో న్యాయవాదులు కదిరి రాము, కోటేశ్వరరావు, శశికళ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు ప్రజలకు ఇచ్చే బాధ్యత అధికారులదే
**మండల స్పెషల్ అధికారి కె.శాస్త్రి**



సబ్బవరం : ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు ఇచ్చే బాధ్యత అధికారులదేనని మండల స్పెషల్ అధికారి శాస్త్రీ అన్నారు. మండలంలోని అంతకాపల్లి గ్రామ పంచాయితీలో శుక్రవారం గ్రామదర్శిని గ్రామ వికాసం కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అధితులుగా మండల స్పెష్ అధికారి కె.శాస్త్రి పాల్గొని మండల స్థాయి అధికారులతో కలిసి గ్రామంలో వీధుల్లో పర్యటించి మంచినీటి పథకాల పనితీరుపై అలాగే మరుగుదొడ్లను సందర్శించి వాడకం గురించి అడిగి తెలుసు కున్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని సంద ర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసు కున్నారు. గ్రామంలో ఏమైనా సమస్యలు వుంటే చెప్పండి. వాటిని పరిష్కరిస్తానని అన్నారు. మండల స్థాయి అధికారులు వివిధ రకాల పథ కాలు గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, సూర్యనారాయణ, ఎంఇఓ ఆర్‌ఆర్‌కె.నర్శింగరావు, మాజీ గ్రామ ఉప సర్పంచ్ మిడతాడ మహలక్ష్మినాయుడు, ఎంపీటీసీ ముత్యాలునాయుడు, సెక్రటరీ పైడి రాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో అవసరాలను తెలియజేయండి
**ఎంపీపీ సుకల రమణమ్మ**



మాట్లాడుతున్న ఎంపీపీ సుకల రమణమ్మ

నర్సీపట్నం : గ్రామాల్లో అవసరాలను తెలియ జేస్తే పరిష్కరిస్తామని ఎంపిపి సుకల రమణమ్మ అన్నారు. శుక్రవారం వేములపూడి గ్రామంలో గ్రామదర్శిని కార్యక్రమం జరిగింది. ముందుగా పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని, రేషన్ దుకాణాన్ని సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థు లతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి సంతృప్తి చెందారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లోని నెలకొన్న సమస్యలను గ్రామదర్శి దృష్టికి తీసుకువస్తే వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జయమాధవి, మాజీ సర్పంచ్ బోళెం నర్సింహమూర్తి, మండల టీడీపీ అధ్యక్షులు లాలం శ్రీరంగస్వామి, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### అప్పన్నను దర్శించుకున్న
# ట్రిబ్యునల్ జడ్జి గోవిందరాజు దంపతులు



సింహాచలం : శ్రీ వరహాలక్ష్మీ నరసింహ స్వామి వారిని శుక్రవారం ట్రిబ్యునల్ జడ్జి గోవిందరాజు సతీ సమేతంగా స్వామివారిని దర్శించు కున్నారు సింహగిరికి చేరుకున్న వారికి ఆలయ అధికారులు సాంప్రదాయం ప్రకారం ఆలయం లోనికి స్వాగతం పలుకగా అంత రాలయంలో అర్చక స్వాములు వారి గోత్రనామ ములతో అర్చనలు చేశారు. అనంతరం కప్ప స్థంభం ఆలింగనం చేసుకోగా బేడామండపంలో వైదికులు ఆశీర్వచనం పలికారు అనం తరం ఆలయ ఏఈ ఓఆర్‌వీఎస్ ప్రసాద్ అధి కారులు వారికి స్వామివారి చిత్రపటం ప్రసాదం అందజేశారు.

### 41 వార్డులో
# టీడీపీ కార్యకర్తల సమావేశం



కంచరపాలెం : జీవీఎంసీ 41 వార్డ్ టిడిపి కార్యకర్తలు సమావేశం వార్డు పరిధిలో ఉన్న సుభాష్ నగర్లో శుక్రవారం జరిగింది .వార్డు టిడిపి అధ్యక్షుడు పెంటకోట త్రినాధరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు జన్మభూమి కమిటీ సభ్యులు కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షుడు మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు పి గణబాబు వార్డులో ఇటీవలి నగరదర్శిని నగర వికాసిని కార్యక్రమంలో వార్డులో రెండు పర్యాయాలు పర్యటించారని ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని ఆయన పేర్కొన్నారు .అదేవిధంగా వార్డు అభివృద్ధి కొరకు ఎమ్మెల్యే రెండు కోట్ల అభివృద్ధి పనులు ఆయన నేతృత్వంలో జరిగాయని ఎన్టీఆర్ హౌసింగ్ స్కీం కింద రూ 2. లక్షల 50 వేలు రూపా యలను 130 మందికి ఆసవాని పాలెం ప్రాంతంలో ఉన్నవారికి ఇవ్వడం జరిగిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంతేకాకుండా ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా వార్డులో కాకుండా నియోజావర్గంలోనే ఎంతో మంది లబ్ధి పొందు తున్నా రని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో నాయకులు జన్మభూమి కమిటీ సభ్యులు కార్తిక్ (కుట్టా), నాగాల అప్పలరాజు, సుధాకర్ ,బి శ్రీనివాసరావు ,సంతోష్ కుమార్ ,కె రాము ,కెవి రమణ కె రాజు ,దేవుడు మరియు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 'దేశం' నుంచి వైకాపాలోకి

విజయనగరం: తెలుగుదేశం ప్రభుత్వం ప్రజావ్యతిరేకపాలన, అవినీతికి విసిగివేసారి తామంతా వై.యస్సార్.కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని కొత్తపేట గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలు 50కుటుంభాలతో అట్టాడ శ్రీను ఆధ్వర్యంలో వై.యస్సార్.కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరికీ డా॥ శ్రీమతి బొత్స ఝాన్సీ లక్ష్మి, కోలగట్ల వీరభద్రస్వామి, మజ్జి శ్రీనివాసరావు, నియోజకవర్గం సమన్వయకర్త పెనుమత్స సాంబశివరాజు, విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గం పార్టీ అధ్యక్షులు బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడులు పార్టీలో చేరినవారికి కండువాలు వేసి పార్టీలో చేర్చుకున్నారు.సభలో పార్టీ నాయకులు పి.వి.వి.సూర్య నారాయణ రాజు, కందుల రఘుబాబు, చనుమల్ల వెంకట రమణ, సింగుబాబు, జెడ్పీటీసి గదల సన్యాశి నాయుడు, కె.వి.సూర్యనారాయణరాజు, పతివాడ అప్పలనాయుడు, బొత్స లక్ష్మణరావు, ఎం.ఎల్.ఎన్.రాజులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి నగరాల సంఘం సమావేశానికి ఏర్పాట్లు ముమ్మరం



మల్కాపురం : రాష్ట్రస్థాయి నగరాల సంఘం సమావేశం డిసెంబర్ 17వ తేదీన మధుర వాడ జంక్షన్, కోమ్మాది మూడు గుడుల వద్ద జరగనున్నట్లు నగర సంఘాల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ నాయ కులు మాట్లాడుతూ నగరాల సంఘంలో ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నమని, ముఖ్యంగా సంఘ సమస్యల పైన పోరాటం చేయ్యడం వంటి అంశాల మీద చర్చకు సమావేశం ఏర్పాటు చేస్తున్నమని అన్నారు. ఈ సందర్భంగా సమావేవానికి విచ్చేసే వారికి భోజన ఏర్పాట్లు కూడా చేస్తున్నట్లు తెలియజేశారు.

# రైతులకు పరిహారం కోసం సీతారాం దీక్షలు
**మూడవరోజుకు చేరిన దీక్ష**



అనకాపల్లి : సంపతిపురం శివారు టి. వెంకుపాలెం గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 67,68 లో గల భూమిలో సాగు రైతులకు పరిహారం చెల్లించాకే భూములు సేకరించాలనే డిమాండ్ తో జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు కొణతాల సీతారాం చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ సుమారు 100 మంది రైతులు ఈ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారనే విషయం అధికారులకు తెలిసినా పరిహారం ఇవ్వకుండా భూములు సేకరించడానికి చర్యలు తీసుకోవడం పూర్తిగా అన్యాయమన్నారు. రైతులతో కలిసి మూడు రోజులుగా నిరసనలు వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు స్పందిం చకపోవడం దారుణమన్నారు. రైతులకు పరి హారం చెల్లించే వరకూ పోరాటం ఆగదన్నారు. అవసరమైతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వం వెంటనే దిగవచ్చి రైతులకు పరిహారం చెల్లించాలని సీతారాం డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రైతులు కుండల లోవరాజు, ఉరుకూటి అప్పారావు, బోరరాజు, ఉరుకూటి బాబూరావు, జనసేన నాయకులు పాము పైడిరాజు, నంబారు రమణ, పల్లా శ్రీను, షేక్ ఉమర్ , సురభి హరీష్, గల్లా వినోద్, దాడి బుజ్జి, నిమ్మదల సురేష్, రాజనాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మథర్ ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసిన ఉచిత గ్రంధాలయ సేవలు వినియోగించుకోవాలి
**తహశీల్దార్ రామారావు**




సబ్బవరం : మథర్ ఛారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసిన ఉచిత గ్రంథాలయ సేవలను వినియోగించుకోవాలని విద్యార్థులను తహశీల్దార్ రామారావు కోరారు. మండల కేంద్రంలో ఎస్‌బిఐ మేడపైన గురువారం మథర్ ఛారిటబుల్ ఆధ్వర్యమున ఉచిత గ్రంథాలయంను విద్యార్థులకు కొరకు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల తహశీల్దార్ పి.రామారావు, ఎస్‌బిఎన్. ప్రభాకరరెడ్డి పాల్గొని గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ విద్యార్థుల కొరకు ఏర్పాటు చేసిన ఉచిత గ్రంథాలయ సేవలను వినియోగించుకోవాలన్నారు. మండలంలో ఇలాంటి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడాన్ని మథర్ ఛారిటబుల్ అధ్యక్షుడు సత్య గంగరాజు అభినందించారు. అనంతరం గ్రంథా లయ రీడింగ్ రూములను పరిశీలించారు. స్థానిక ఎస్‌బిఎన్. ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ కాంపిటేటివ్ పోటీ పరీక్షలలో పాల్గొని విద్యార్థులు పై పై చదువులు చదవాలన్నారు. అన్ని బుక్స్ ఒకేసారి చదవకుండా ఒక్కొక్కటి చదవాలన్నారు. విద్యా ర్థులు డైలీ పేపర్లు చదవాలన్నారు. ప్రతి రోజు కాంపిటేషన్ ఎగ్జామ్ గురించి అవగాహన చేసుకుని ప్రణాళిక ప్రకారం చదవాలన్నారు. అనంతరం మథర్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వృద్ధాశ్రమానికి స్థలం కేటాయిం చాలని వినతిపత్రాన్ని తహ శీల్దార్‌కి సమర్పిం చారు. ఈకార్యక్రమంలో ఉపా ధ్యాయ ప్రతినిధి బి.వి.రమణ, జి.జగన్నాధరావు, చేతన, స్వాతి, రూప మరియు అత్యధికంగా విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్రేక్షకుల చప్పట్ల మధ్య పరవశమైన
# చిన్నారుల కళా ప్రదర్శనలు




విజయనగరం: స్థానిక శ్రీరామ చారిటబుల్‌ట్రస్ట్ నిర్వహిస్తున్న చిల్డ్రన్ ఫెస్టివల్ 2018లో శుక్రవారం పలు అంశాల్లో పోటీలు జరిగాయి. శాస్త్రీయ, జానపద నృత్య విభాగాల్లో వ్యక్తిగత, బృంద నృత్యాలు నయన మనోహరంగా ఆకట్టుకున్నాయి. ఉత్త రాంధ్ర జిల్లాల నుంచి 150 పాఠశాలలకు చెందిన 2వేల మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఉదయం 9 గంటనుండి నిర్వరామంగా జరిగాయి. కూచుపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ ఆచార్య కె.రామ్మూర్తి పర్యవేక్షణలో నాట్యాచార్యులు వి.రమణారావు, వి.జగన్నాధరావుల బృందం న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. అరవిరసిన విరిబాలలు, నటనాకళలాన్ని ప్రదర్శించారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి ప్రేక్షక&ఉలు వందలాదిగా ప్రదర్శనలకు తరలివచ్చారు. కళావేదిక ప్రాంగణం, శ్రీరామపురం కిటకిటలాడింది. సాంకేతిక యుగంలో మరుగున పడిపోయిన ఉత్తరాలు, తెలుగుపద్యాలు ప్రేక్షలకు వీనులవిందు చేశాయి. రాంబట్ల వెంకట రామస్వామి, కదిలిండి రంగరాజులు బృందాలు వీటికి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. నన్నయ్య నుంచి కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి వరకు వివిధ కవులు రచించిన పద్యాలను చిన్నారులు పట్టం కట్టాయి. ప్రతీ బృాందానికి వందమంది పాల్గొన్నారు. ఉదయం వక్తృత్వపోటీలు, సాంఘీక, పౌరాణిక లఘు నాటికలు, దేశభక్తిగీతాలు శనివారం ఉంటాయని సంస్థ అధ్యక్షులు డాక్టర్ టి.సుబా రావు, ప్రధాన కార్యదర్శి కె.మధురవాణి, వి.సోమేశ్వరరావు తెలిపారు.

## గంటా చేతులమీదుగా చంద్రన్న పెళ్లికానుక



విశాఖపట్నం: సింహాచలం 72 వ వార్డు పరిధి సింహాచలంలో జరిగిన వివాహానికి మనవవనరుల శాఖమంత్రి గంటా శ్రీనివసరావు ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులకు చంద్రన్న పెళ్లికానుక క్రింద 35 వేల రూపాయల చెక్కను అందజేసి వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆయనవెంట టిడిపి అర్బన్ ఉపాద్యక్షుడు పాశర్ల ప్రసాద్ టిడిపి 72వ వార్డు అద్యక్షుడు పిసిని వరహానరసింహం లంక సత్తిబాబు గుసిడి శంకర రావు ఇతర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

యానాం: నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులకు స్వపరిపాలన శాఖ ఆది ద్రావిడ సంక్షేమశాఖ ద్వారా రూ. 4 కోట్లు అభి వృద్ధి పనులు చేసేందుకు ప్రతిపాదనలు ప్రభు త్వానికి సమర్పించినట్లు పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు తెలిపారు. ఎమ్మెల్యే లకు కేటాయించే రూ. 2 కోట్లు స్వపరిపాలన శాఖ నిధులతో 2018 - 19 ఆర్థిక సంవత్సరంలో 22 పనులు వివిధ ప్రాంతాలలో చేయనున్నట్లు తెలిపారు. కొత్తబస్టాండ్‌లోని ముస్లి శ్మసానవాటిక వద్ద ఆటోస్టాండ్‌కు కార్యాలయం, ఇతర పనులకు రూ. 12 లక్షలు, గోపాల్ నగర్‌లోని నల్లం నాగబాబు ఇంటిసమీపంలో సిసి రహదారి నిర్మాణానికి రూ. 25 లక్షలు, కురుసంపేట శ్మసానవాటికవద్ద పడమర గోడ పెంచడానికి ఇతర పనులకు రూ. 2 లక్షలు, అంబేద్కర్ నగర్ లో ఇ. హేమలత ఇంటివద్ద సిసి రోడ్డు ఎత్తు పెంచడానికి 1.5 లక్షలు, పరంపేట హెల్త్ సెంటర్ ఎదురుగా రహదారులు, కాలువల అభివృద్ధికి రూ. 21. 20 లక్షలు, 216 జాతీయ రహదారిని చేర్చి తనకాలపేట పరిధిలో రహదారుల అభివృద్ధికి రూ. 23 లక్షలు, గీతా వారి సందు వద్ద కాలువ పూనర్మిణానికి రూ. 3.50 లక్షలు, బాలయోగి కాలనీలో దక్షిణవైపు కాలువల నిర్మాణానికి రూ. 6 లక్షలు, కనకాల పేటలో ఆంధ్రా బోర్డర్ వద్ద స్టోర్‌రూం నిర్మాణా నికి రూ. 10 లక్షలు, కనకాల ఫిషర్‌మేన్ కాలనీ లో కాలువ గోడ నిర్మాణానికి రూ. 12లక్షలు, తదితర పనులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలి పారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ జి. గౌరీసరోజ, ఎఇ ఎం. రామలింగేశ్వరరావు, జెఇ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

## పరవాడలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

### ముఖ్యఅతిథిగా ఎమ్ఇఓ సునీత హాజరు



పరవాడ: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలస్థాయిలో భవిత సెంటర్ పరవాడలో జరిగింది. అందులో బాగంగా జిల్లాస్థాయి దివ్యాంగుల అటలపోటీ లను నిర్వహించి బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా మండల విద్యాశాఖాదికారి సునీత హజరై అమె చేతులు మీదగా అటలపోటీల్లో గెలిపొందిన బి.చందుకు సిల్వరుమేడల్‌ను అందజేసారు. అనంతరము శ్రీసత్యసాయి సేవా ట్రస్టువారు టీచింగ్ మెటరియల్ దివ్యాంగులకు యానిఫామ్స్ కుట్టుమిషన్ బహుకరించారు. ఎమ్ వి పాండేషన్ వారు రేమిడియల్ వర్క్ బుక్స్ ముపైఐదు సెట్స్‌ను అందజేసారు.

దివ్యాంగులుకు బాక్స్‌లును జిల్లా సహితవిద్యా సమన్వయకర్త శ్రీదేవి చేతులు మీదగా అందజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహయ సహిత విద్యా సమన్వయకర్త రామకృష్ణ, సత్యసాయి ట్రస్టు కన్వీనర్ రామకృష్ణ, మృదుల, అనంద్, కృష్ణ, ఏమ్ వి పాండేషన్ దనలక్ష్మి, పాఠశాల ఉపాద్యాయులు నాగేశ్వరావు తథితర్లు పోల్గోన్నారు.

## 47వ వార్డు హిమాచల్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం



మల్కాపురం: గాజువాక 47వ వార్డు హిమాచల్‌నగర్‌లో ఎన్టీఆర్ మరియు ఎమ్‌పిఎమ్ సంయుక్తంగా ఎన్టీఆర్ సేవాసంఘం అధ్యక్షుడు పాండ్రంగి జయరాజ్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. దివంగత నేత ఎమ్‌వివిఎస్ మూర్తి మనవడు భరత్ ముఖ్యఅతిదిగా పాల్గొని మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సేవ చేయడం వల్ల వచ్చే ఆనందం వెల కట్టలేనిదని, గీతం ట్రస్ట్ నుంచి ఇది 90వ మెడికల్ క్యాంప్ అని అన్నారు. ఈ మెడికల్ క్యాంప్ ద్వారా 650 మందికి ఉచితంగా కంటి పరీక్షలు జరిపించామని అన్నారు. అవసరమైతే కంటి ఆపరేషన్లు కూడా ఉచితంగా నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల వాసు, శంకరరావు, ఆనంద్, దొడ్డి రమణ, లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## సంబరాలు జరుపుకుంటున్న 47వ వార్డు టి.డి.పి. నాయకులు



మల్కాపురం: జీవీఎంసీ 47వ వార్డు కొత్తనక్కవానిపాలెం, శ్రీచైతన్యనగర్‌కాలనీలో టి.డి.పి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం విశాఖ జిల్లాలోని 72 వార్డుల కన్నా 47వ వార్డులో ముందుగా 5000 మార్కు దాటిందడంతో ఆ వార్డు నాయకులు వేడుకలు జరుపుకున్నారు. కేక్ కటింగ్ చేసి తమ ఆనందాన్ని పలువురు నాయకులతో పంచుకున్నారు. ఈ సందర్బంగా వార్డు అధ్యక్షుడు వంశీకిషోర్‌యాదవ్ మాట్టాడుతూ టి.డి.పి పార్టీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే ఇనాడు ప్రజలు తమకుతాముగా పార్టీ సభ్యత్వం తీసుకోవడానికి కారణమైందని, ప్రజలంతా తమ పార్టీకి తోడుగా ఉంటారనడంలో సందేహంలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో రేవళ్ల సత్యనారాయన, అప్పారావు, లక్ష్మి, సూర్యకుమారి, వెంకట్రావు, తూటా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నేడే యూత్ ఫెస్టివల్

యానాం: యానాం యూత్ క్రిస్టమస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయినట్లు చైర్మన్ ముదునూరి సతీష్‌రాజు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక రాజీవ్ గాంధీ బీచ్ ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యానాం యూత్ క్రిస్టమస్ వేడుకలకు పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు ముఖ్యఅతిధిగి విచ్చేస్తున్నారన్నారు. అంతర్జాతీయ సువార్తకులు డాక్టర్‌జాన్ వెసిలె ఈ ఫెస్టివల్‌లో పాల్గొంటున్నారన్నారు. రాష్ట్ర నలుమూలల నుండి పలువురు ప్రముఖులు విచ్చేస్తున్నారన్నారు. స్థానిక కొత్త బస్టాండ్‌లో మున్సిపల్ ఓపెన్ ఆడిటోరింలో సాయంత్రం 5 గంటలకు క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

తాళ్లరేవు: జార్జిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలు అయ్యాయి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పి. మల్లవరం గ్రామానికి చెందిన తలాది శ్రీదర్ యానాం వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా అదుపుతప్పి పడిపోయాడు కొందరు రోడ్డుపై పడిఉన్న శ్రీధర్‌ను గుర్తించి అతని చెవులనుండి రక్తం వస్తుండటంతో స్థానికులు యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. వైద్య పరీక్షలు అనంతరం మెరుగైన వైద్యం కొరకు కాకినాడ తరలించారు.

## స్టేషన్ దాడిలో మాజి సర్పంచ్ అరెస్ట్

అరకు: కిడారి, సోమల మావోల హత్య అనంతరం అరకులోయ, డుంబ్రిగుడ స్టేషన్ దాడిలో నిందితుడుగా ఉన్న మాదల పంచాయతీ మాజి సర్పంచ్ కొర్ర.సన్యాసి(50)ను తెల్లవారు జామున సిట్ బృందం స్వగ్రామంలో అరెస్ట్ చేసీ స్టేషన్ కస్టడీలో పెట్టి ఉన్నారు. దీనిపై రాష్ట్ర యస్.సి,యస్.టి కమిషన్ సభ్యుడు సివేరి.అబ్రహం స్టేషన్ సిట్ అధికారులతో చర్చ జరిపిన అనంతరం రిమాండ్‌కు తరలిస్తారని సమచారం.

### సత్యదేవున్ని దర్శించిన జస్టిస్ సముద్రాల గోవిందరాజులు



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్న వరం శ్రీ వీరవెంకట సత్యనా రాయణ స్వామివార్ని శుక్రవా రం జస్టిస్ సముద్రాల. గోవింద రాజులు శ్రీ స్వామివార్ని దర్శిం చి, ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ఆలయ సూప రింటెండెంట్ బలువు.సత్య శ్రీనివాస్ ఘన స్వాగతం పలి కారు. దర్శనానంతరం వేద పడితులు వేదాశీస్సులు అనం తరం శ్రీ స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

## కనక మహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం

యలమంచిలి: కోరికలు తీర్చే కల్పవల్లి సిరులొలికించే అమ్మవారి మార్గశిర మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. యలమంచిలి పట్టణంలో ధర్మవరంలో వెలసిన శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు ఆచరించి, అమ్మవారికి పాలాభిషేకాలు నిర్వహించారు. కోటి పంతులు పూజలు నిర్వహించగా ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వారు కొఠారు గోవిందు, కొఠారు కొండబాబు, కొఠారు శ్రీరామనాయుడు, మడగల సత్యనారాయణ, పెద్దలు బి. ఎర్రయ్యదొర, గాయత్రీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### చినములగాడలో నూతన గ్రామ కమిటీ ఎంపిక



మల్కాపురం: 46వ వార్డు చినములగాడ గ్రామంలో నూతన గ్రామ కమిటీ ఏకగ్రీవంగా ఎంపికయ్యింది. ఈ సందర్భంగా నూతన గ్రామ కమిటీ సభ్యులు స్దానిక ఎమ్మెల్యే గణబాబు కలిసి గ్రామం తరుపున సమస్యల పరిష్కారించాలని కోరారు. ఎమ్మెల్యే గణబాబు కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ గ్రామ సమస్యలకు తన వంతు కృషి చేస్తానని హామి ఇచ్చారు. ఈ కమిటీలో గౌరవాధ్యక్షుడిగా నీలాపు తాతారావు, అధ్యక్షుడిగా శీరపు నరసింగరావు, ప్రధాన కార్యదర్శిగా పురెడ్డి సన్యాసిరావు ఇంకా పలువురు సభ్యులుగా ఎంపికయ్యారు.

## టీడీపీకి బుద్ధి చెప్పాలి

విశాఖపట్నం: ఆంధ్రరాష్ట్ర ప్రజలు తెలుగుదేశం పార్టీకి సరైన గుణపాఠం చెప్పాలని ఎపీస్టేట్ వైడ్ అక్కినేని నాగార్జున, నాగచైతన్య, అఖిల్ ఫ్యాన్స్ మరియు సేవాసమితి అధ్యక్షులు బి రాముయాదవ్ అన్నారు. శుక్రవారం చినగదిలి సేవాసమితి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బీజేపీతో నాలుగు సంవత్సరాలు జతకట్టి, ప్రత్యేక హెూదా విషయంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న పోరాటాన్ని ఎదుర్కొనలేక ఇప్పుడు ధర్మపోరాట దీక్ష పేరుతో ప్రజల్ని మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రక్కరాష్ట్రమైన తెలంగాణ ప్రజలు బుద్ది చెప్పినట్లు ఇక్కడ కూడా టిడీపీకి బుద్ధి చెప్పాలన్నారు. చిరకాల ప్రత్యర్థి అయిన కాంగ్రెస్‌తో జత కట్టి తెలుగువారి ఆత్మ గౌరవాన్ని మంటకలిపారని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి తగిన గుణపాఠం చెపుతారన్నారు.

### స్వయం ఉపాధి అవకాశాలకు శిక్షణా తరగతులు

రావులపాలెం: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎపిఎస్-ఎస్‌డిసి) ఆధ్వర్యంలో ఈ నెల 17, 18, 19 తేదీలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తామని ఎమ్‌పిడిఓ పి. జగదాంబ తెలిపారు. ఈ అవగాహనా కార్యక్రమంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు పలు స్వయం ఉపాధి అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధిపై అవగాహన, ప్రాజెక్టు రిపోర్టు తయారు తదితర విషయాలపై తెలియపరుస్తారని ఆమె తెలిపారు.

## రోటరీ క్లబ్ వారిచే
# వికలాంగులకు ఉచిత వీల్ చైర్లు పంపిణీ



అన్నవరం: తూ.గో.జిల్లా అన్నవరం రోటరీ క్లబ్ వారి ఆద్వర్యంలో శుక్రవారం శృంగవృక్షం గ్రామంలోని వికలాంగులకు వీల్ చైర్లను స్దానిక ఎలిశెట్టి.సుబ్బారావు, జువ్వల.వీరలక్ష్మి, ఇల్లంకి. సత్యనారాయణలకు పంపిణీ చేసారు. అదే విధంగా కొంత రుసుమును కూడా పంపిణీ చేసారు. రోటరీ క్లబ్ అన్నవరం వారు శృంగవృక్షం గ్రామానికి వచ్చి వీల్ చైర్లు, కొంత రుసుమును పంపిణీ చేయడం పట్ల గ్రామస్థులు, గ్రామ పెద్దలు హర్షము వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రవి మాష్టారు మాట్లాడుతూ ముందు ముందు మా రోటరీ క్లబ్ ద్వారా శృంగవృక్షం గ్రామంలో మరిన్ని సేవలు అంద జేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రవి మాష్టారు, సెక్రటరీ సరమర్ల. మధుబాబు, క్లబ్ సభ్యులు లెక్చరర్ గంటసాల. వెంకట్, రాయి.శ్రీనివాస్, రామచంద్రరావు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడు నియోజకవర్గ
# టీడీపీ ఎస్సీసెల్ కార్యవర్గ సమావేశం



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రత్తిపాడు నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ సమావేశం ఈరోజు ఉదయం 10 గంటలకు డిసిసిబి చైర్మన్, అప్కాబ్ వైస్ చైర్మన్ మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వరుపుల.రాజా ఆఫీసులో జరిగింది. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ దళితులకు ప్రత్యేకించి ఈ ప్రభుత్వ కాలంలో చేసిన అభివృద్ధి, చేపట్టిన పథకాల గురించి చర్చించి, రాబోయే కాలంలో తెలుగుదేశం పార్టీకి ఎస్సీలు అందరూ అండగా నిలబడి రాజా నాయకత్వంలో ప్రత్తిపాడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని, ప్రత్తిపాడులో టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ స్థాయిలో భారీ బహిరంగ సభ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేసారు. ఈ సమావేశంలో డిసిసిబి డైరెక్టర్ గుడాల.రామకృష్ణ, రాజాల. చిట్టిబాబు, పులి మధు, గునుపూడి కొండబాబు, బి.మధుబాబు, పలివెల సతీష్, బత్తిన అప్పారావు మరియు నాలుగు మండలాల నుండి వచ్చిన ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

# తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలి

యానాం: బంగాళఖాతంలో ఏర్పడ్డ వాయు గుండం ప్రభావంవల్ల ప్రజలు అప్రమత్తంగా మెలగాలని పరిపాలనాధికారి దవులూరి సుబ్ర మణ్యేశ్వరరావు సూచించారు.

శుక్రవారం ఉదయం స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం లో వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి తుఫాను హెచ్చరికల నేపథ్యంలో నియోజక వర్గ పరిధిలో 15, 16 తేదీలలో భారీ వర్షాలు, ఈదురు గాలులు ఏర్పాడే ప్రమాదం ఉందని దీనిపై ప్రజలను అధికారులు అప్రమత్తం చేయాలని సూచనలు చేశారు. వాయుగుండం ప్రభావం వల్ల గుడిసెలల్లో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా రెవెన్యూ, మత్స్య, మున్సిపాల్టి, పోలీసు శాఖ అధికారులకు సూచించారు. ఆయా ప్రాంతాలలో తుపాను షెల్టర్లు, కమ్యూనిటీ భవనాలు, ప్రభుత్వ పాఠశాలను పునరావాస కేంద్రాలుగా ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. దీనిపట్ల ప్రజలందరిని అప్రమత్తచేయాలని, సముద్రం లోకి మత్స్యకారులు వేటకి వెళ్ళకుండా చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ జి. గౌరీసరోజ, ఎస్‌పి. నితిన్ గోహల్, విద్యాశాఖ అధికారి కాలే సాయినాధ్, మత్స్యశాఖ ఏడి డి. దొంతయ్య, రెవెన్యూశాఖ డిప్యూటీ తహాశీల్దారు జి. సత్యనారాయణ, ఆసుపత్రి డిడి ఎంవిఎస్ ప్రసాద్, సిఐ జి. సత్యనారాయణ, కోపరేటివ్ అధికారి ఎల్ విద్యాసాగర్, వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేకాధికారులు
# గ్రామ సమస్యలను సత్వరం పరిష్కరించాలి
### ఎమ్‌పిపి కోట చెల్లయ్య



రావులపాలెం: మండలంలో దోమల బెడద ఎక్కువగా ఉన్నందున దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్‌పిపి కోట చెల్లయ్య అధికారులకు సూచించారు. శు క్రవారం స్థానియ మండల పరిషత్ కార్యాలయం లో ఎమ్‌పిపి కోట చెల్లయ్య అధ్యక్షతన పంచా యితీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు, ఉపాధి హామీ కూలీలతో ప్రత్యేక సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయితీల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న రోడ్డు పను లు త్వరిత గతిన పూర్తిచేయాలని, గ్రామాల్లో టాంటాం వేయించి సభద్వారా సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని, ప్రత్యేక అధికారులు ప్రజలకు పూర్తి స్థాయిలో అందు బాటులో ఉండి సమస్యలను వెంటనే పరిష్క రించాలన్నారు. గ్రామాల్లో దోమల బెడద ఎక్కు వగా ఉన్న కారణంగా పారిశుద్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి, రావులపాలెం సిఆర్‌సి సామాజిక సేవా సంస్థ ఉచితంగా అందజేయుచున్న దోమల నివారణకు పొగ యంత్రాన్ని వినియోగించి, డ్రైన్లలో సీల్డు తీయించి ఎబెట్ దోమలమందు పిచికారీ చేయించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సాకా ప్రసన్నకుమార్, వైస్ ఎమ్‌పిపి దండు వెంకట సుబ్రహ్మణ్య వర్మ, ఎమ్‌పిడిఓ పి. జగదాంబ, తహాశీల్దారు జి. వేంకటేశ్వరరాజు, పశుసంవర్ధక శాఖ ఎడి పి. నాగమణి, ఏఓ బి మీన, విస్తరణాధికారి కె. వెంకటేశ్వరరావు, పంచాయితీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ సదస్సులో స్థానికుల పై ఆత్మీయతే లేదు

## జనసేన నాయకులు ఆలివర్ రాయి



భీమునిపట్నం : చిట్టివలస బంతాట మైదానంలో జరిగిన ఆత్మీయ సదస్సు లో స్థానికుల పై ఆత్మీయతే లేదని భీమిలి నియోజకవర్గ జనసేన నాయకులు ఆలివర్ రాయి పేర్కొన్నారు ఆయన శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, చంద్రబాబు నాయడు గంట ప్రసంగంలో స్థానిక సమస్యలపై ఐదు నిమిషాలు కూడా ప్రస్తావించకపోవడం పై ఈ సదస్సు దేనికోసం ఏర్పాటు చేసారని ఆయన ధ్వజ మెత్తారు.. 2015 జూన్ 15 న మొట్టమొదటి క్యాబినెట్ మీటింగ్ లో పంచ గ్రామాల సమస్య పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని ఇప్పటివరకు నెరవేర్చక పోగా, లక్ష్మివారం నియోజకవర్గంలోనికి వచ్చి అటార్నీ జనరల్ ని పిలిపించి ఈ విషయంపై చర్చిస్తానని అనడం ఎంతవరకు సమంజసమని, ప్రజలను మళ్లీ మభ్యపెట్టే ప్రయత్నం కాదా అని అన్నారు. అప్పుడు ఇచ్చిన హామీ గుర్తు లేదా లేక ఇక్కడ సదస్సు నిర్వహించే తొందరలో ప్రజలు ప్రశ్నిస్తారు అని తెలిసి కూడా కుంటిసాకులతో సర్ది చెపుదామని అనుకున్నారా అని జనసేన నియోజకవర్గ నాయుకులు అలీ వర్ రాయి తీవ్రంగా ఖండించారు. గత పది సంవత్సరాలుగా మూతబడి ఉందన్న విషయం తెలియనట్లు, అ సమస్య ఇప్పుడే ఆయన దృష్టికి వచ్చినట్లు ఈ సమస్యను పరిష్కరించమని ఇక్కడ నాయకులకు చెప్పడం, పరిష్కారం జరగకపోతే అప్పుడు నా దగ్గరికి రండి నేను పరిష్కరిస్తానని అనడం హాస్యాస్పదం అని అన్నారు. ఇన్ని సంవత్సరాలుగా కార్మికులు చేస్తున్న పోరాటాలు, ఆందోళనలు, ముఖ్యమంత్రిగా ఆయనకి పట్ట లేదా అని అన్నారు . స్థానిక నాయకులు ఈ సమస్య పరిష్కారం పట్ల చూపిస్తున్న చిత్తశుద్ధి బట్టబయలు అయిందని, నిజంగానే కార్మికుల సమస్యను పరిష్కరించాలని అనుకున్న వారు అయితే ఇప్పటి వరకు దీనిపై ముఖ్యమంత్రి దగ్గర ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. ఈ కార్మికుల ఆగ్రహం తప్పనిసరిగా వచ్చే ఎన్నికలలో తగు గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు.అలాగే ఆర్టీసీ డిపో కట్టడానికి నిధులు లేవనడం అదీ ఒక ముఖ్య మంత్రి హోదాలో అనడం శోచనీయమని అన్నారు. భీమిలి నియోజకవర్గం లో వేలాది ఎకరాలు ప్రైవేటు సంస్థలకు కట్ట పెడుతున్న తరుణంలో వాటి నుంచి వచ్చిన ఆదాయం ఈ ప్రాంతం కు ఎందుకు వాడటం లేదని ప్రశ్నించారు.నిధులు లేక పోతే ఇంతకుముందు చేపట్టిన విధంగా పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్ షిప్ (P. P. P) విధానాన్ని ఎందుకు అవలంబించ లేదని ప్రశ్నించారు. ఒకేసారి అంత భారీ ఎత్తులో డిపో నిర్మాణం సాధ్యం కాకపోతే దశల వారీగా నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలను అవాస్తవాలతో మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆలివర్ పేర్కొన్నారు.నియోజకవర్గంలో 3 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామని చెప్పుకుంటున్న నేపథ్యంలో చేసిన పనుల పై శ్వేత పత్రం ప్రకటించాలని, అలాగే పబ్లిక్ గా డిబేట్ కి రావాలని పాలక సభ్యులకు సవాలు విసిరారు.చిల్లపేట చెరువు సుందరీకరణకు నాలుగు కోట్లు కేటాయించడం వల్ల ప్రజలకు ఉపయోగమా లేక సభా ప్రాంగణం కు దగ్గర లో పగిలి నిండి పొర్లుతున్న సెప్టిక్ పైప్స్ మరమ్మతులు ముఖ్యమా అని ప్రశ్నించారు. జూట్ మిల్ క్వార్టర్స్.లో కాలువలకు అవుట్ లెట్ లేక అక్కడే ఖాళీ స్థలాల లోకి మురుగునీరు పేరుకుపోవడం వలన పెరుగుతున్న మలేరియా డెంగ్యూ కేసుల పరిష్కారం అవసరమా అని అడిగారు. నియోజకవర్గంలో ఉన్న ఆస్పత్రిలో సిబ్బంది కొరత వసతుల కొరత ఔషధాల కొరత తీర్చకుండా నూరు పడకల ఆసుపత్రిని ప్రకటించడం కేవలం ఎన్నికల స్టంట్ గా తేట తెల్లమవుతుందని విమర్శించారు. భీమిలిలో బీచ్ రోడ్డు విస్తరణ భాగంగా బోయ వీధి లో ఉన్న ఇళ్లను తొలగించి విస్తరించటం అమానుషం మని నోవాటెల్ హోటల్ ఎదురుగా ఏ రీతిలో రోడ్ ని తయారు చేశారో అదే రీతిలో బీచ్ వైపు రోడ్డును విస్తరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా నాయకులు శ్రీ బి.వి కృష్ణయ్య, సోషల్ జస్టిస్ విభాగం సభ్యులు నాయుడు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# కె.జీ.బీ.వి.లో సైన్స్ ఇన్ ఫ్యూర్ మానాక్ పై శిక్షణా కార్యక్రమం

భీమునిపట్నం : గొల్లలపాలెం లో ఉన్న కస్తూరిబాయి బాలికల విద్యాలయం లో శుక్రవారం నాలుగు జిల్లాల కె.జీ.బీ.వి. పిల్లలకు ఉపాధ్యాయులకు ఒక రోజు సైన్స్ ఇన్ ఫ్యూర్ మానాక్ పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశాఖ జిల్లా ప్రాజెక్ట్ అదికారి డాక్టర్ వి. విశ్వనాథ సన్యాసిరావు అద్యక్షత వహించారు.ఇందులో బాగంగా గీతం యూనివర్సిటీ ప్రొఫెసెర్ కొండలరావు,దివ్యశ్రీ లు శాస్త్ర విజ్ఞానం లో కొత్త దనంగా ఎలా చేయాలో విద్యార్డులకు వివరించారు.ఈ కార్యక్రమం లో సైన్స్ ప్రొజెక్ట్ లో నిపుణులు కె.ప్రభాకర రావు జిల్లా అధికారిని రాజేశ్వరి ,కె. శ్రీనివాసరావు ,భీమిలి కె.జీ.బీ.వి. ప్రత్యేక అధికారిని కె. గ్రే స్ లిల్లీ తదితరులు పాల్గొన్నారు.

## బీచ్ అబివృద్ధి, ప్రకృతి అందాలు

# విఘాతం కలుగకుండా చెయాలి

## రామానాయుడు




భీమునిపట్నం : స్థానిక చిన్నబజార్ లో ఉన్న ఆంధ్ర చైతన్య పార్టీ కార్యాలయం లో తగరపువలస లో జరిగిన సి ఎం ఆత్మీయ సద స్సు లో భీమిలి బీచ్ అబివృద్ధి, ప్రకృతి అందాలు విఘాతం కలుగకుండా చెయాలని, లేకపోతే భీమిలి సహజ అందాలు మరుగున పడే ప్రమాదం ఉన్నాదని,అలాగే జ్యూట్ మిల్ సమస్య ను జిల్లా స్థాయిలోనే పరిస్కారం చేసుకోమనడం అవకపోతే నేను పరిష్కరిస్తా అనడం,జ్యూట్ మిల్ సమస్యను ప్రక్కతోవ పెట్టడమే అని ఎ.సి.పి పార్టీ అద్యక్షులు కె.రామానాయుడు అన్నారు.మిల్లు యాజమాన్యం కు రాయితీ ప్రొత్సాహం యిచ్చి ప్రభుత్వ ప్రవేట్ బాగస్వామ్య తో మిల్లును తెరిపించాలనిలేదా వేరే పరిశ్రమ పెట్టేలా సి.ఎం చంద్రబాబు ఆలోచన చేస్తే స్థానికులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఆన్నారు.ప్రాదాన్యత లేని వాటి మీద కోట్ల రూపాయిలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం భీమిలి,తగరపువలస ప్రజలకు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయకపోవడం చాలా బాదాకరం అని అన్నారు.తగరపువల్సలో ఏర్పాటు చేస్తానన్నాఆర్ టి.సి డిపో శంకుస్థాపన చేసికూడా నిర్మాణం చేయక పోవడం విడ్డూరమని అన్నారు. అలాగే పాండ్రంగి బ్రిడ్జి వేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు నిర్మించలేదని అన్నారు . కార్యక్రమం లో ఆంధ్ర చైతన్య పార్టీ నాయుకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# సి.ఎం సభ విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు



భీమునిపట్నం : తగరపువలస పుట్ బాల్ గ్రౌండ్ లో సి.ఎం చంద్రబాబు నాయుడు ఆత్మీయ సభను విజయవంతం చేసినందుకు భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటానూకరాజు ధన్యవాదాలు తెలిపారు. స్థానిక మంత్రి విడిది కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.మంత్రి గంటాశ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఆత్మీయసభను విజయవంతం చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు,రైతులు, మత్స్యకారులు, కర్షకులు,వ్యాపారస్థులు, చేతివృత్తుల వారు, కార్మికులకు పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. అంతే కాకుండా గత వారం రోజులుగా కష్టపడి ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లు చక్కగా చేసిన జివిఎంసి సిబ్బంది, వుడా,రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖ లకు,అదేవిధంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు కృషి చేసిన పోలీస్ సిబ్బంది, అదేవిధంగా ఎలక్ట్రికల్ డిపార్ట్ మెంట్ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని ఆత్మహత్య



భీమునిపట్నం : భీమిలి మండలం భోయపాలెం చైతన్య టెక్నో స్కూల్లో చదువుతున్న సిబి ఎ స్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూ మనీషా కుమారి 17 సంవత్సరాలు లక్ష్మి వారం సాయంత్రం తన రూమ్ లో ఫ్యాన్ ఉ క్ కి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది రెండు రోజులుగా తను చాలా డల్ గా ఉందని తన స్నేహితులు తెలిపారు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కాకినాడ ఆర్డీవోగా రాజకుమారి బాధ్యతలు స్వీకరణ

కాకినాడ : కాకినాడ రెవెన్యూ డివిజనల్ అధికారిగా బి.రాజకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.రాజకుమారి జిల్లా గ్రామీణ నీటిసరఫరా ప్రాజెక్టు( డ్వామా) డైరెక్టర్‌గా పనిచేస్తూ ఆమె ఆర్డీవోగా నియమితులయ్యారు.రాజకుమారి నవంబరు11న కాకినాడ ఆర్డీవోగా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.వివిధ కారణాలతోఆమె ఇప్పటి వరకు ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించలేదు.డ్వామా పీడీగా సమర్ధవంతంగా పనిచేసి,నీతి నిజాయితీకి మారుగా రాజకుమారి నిలిచారు.ఎన్నో అవార్డులు,రివార్డులు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఉపాధి పథకం తేవడంలో ఆమె ఎంతో కృషి చేసారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూజిల్లా అధికారుల సూచనల మేరకు మండల అధికారులు రెవెన్యూ సిబ్బంది సహకారంతో రెవెన్యూ సేవలను ప్రజలకు చేరువ చేస్తామన్నారు. బాధ్యతలు స్వీకరించిన రాజకుమారిని కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పిల్లి సత్యనారాయణ మూర్తి, అర్బన్ తాహశీల్దారు పలువురు తాహశీల్దారులు ఆర్డీవో కార్యాలయ సిబ్బంది అభినందించారు.

# వ్యాపార వర్గాలకు వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుంది

కాకినాడ: రాష్ట్రంలో ఉన్న వ్యాపార వర్గాలకు వైఎస్ జగన్ అండగా ఉంటారని వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగ రాష్ట్ర అధ్యక్షులు కుప్పం ప్రసాద్ అన్నారు.

శుక్రవారం కాకినాడలో ఆయన విలేకరుతో మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో వ్యాపార వర్గాలు అనే ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. చంద్రబాబు నాయుడు హెరిటేజ్ మాల్ పేరుతో మారో దోపిడీకి సిద్దపడ్డారని ఆరోపించారు.తన కుమారుడు లోకేష్ ధనదాహానికి అగ్రిగోల్డ్‌ను సర్వనాశనం చేసారన్నారు. రాష్ట్రంలో ఉన్న వ్యాపార వర్గాల సమస్యలపై అధ్యాయనం చెయ్యాలని తమ అధినేత జగన్ ఆదేశిచారని సమస్యలను సేకరిస్తున్నామని జగన్ అధికారం లోనికి వచ్చిన తరువాత తగిన పరిష్కాంరం చూపుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి పెద్ది రత్నాజీ ,పసుపులేటి తదితరులు పాల్గొన్నారు.

## అనధికార లే అవుట్లు ఉపేక్షించం : గుడా చైర్మన్ గన్ని కృష్ణ

కాకినాడ : అనధికార లేఅవుట్లు, అక్రమ నిర్మాణాల విషయంలో ఉపేక్షించే ప్రసక్తి లేదని, ఈ విషయంలో ఎలాంటి ఒత్తిళ్ళకు తలొగ్గేది లేదని గుడా చైర్మన్ గన్ని క ృష్ణ అన్నారు. గుడా కార్యాలయంలో శుక్రవారం ఓపెన్ ఫోరమ్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి వినతులను గన్ని కృష్ణ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడాను ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. అనధికార లే అవుట్లను కొనుగోలు చేసి మోసపోవద్దని, ఇప్పటికే గుడా పరిధిలో వాటిని గుర్తించి నోటీసులు జారీ చేయడంతో పాటు స్పందించని వాటిపై చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఓపెన్ ఫోరమ్ ద్వారా ప్రజల సమస్యలను నిబంధనలకు లోబడి పరిష్కరిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో గుడా డైరెక్టర్ గట్టి సత్యనారాయణ, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ జి.రామ్ కుమార్, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ సత్యమూర్తి, జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా జంగా



అమలాపురం : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా అమలాపురం చిందాడగరువు గ్రామానికి చెందిన జంగా రాజేంద్రకుమార్ నియమితుల య్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ సత్యమూర్తి నుంచి ఉత్తర్వులు వెలువడ్డా యని ఆయన తెలిపారు. రిటైర్డ్ మండల విద్యాశాఖా ధికారిగా పనిచేసిన ఆయన 2012 నుంచి విశాఖ జిల్లా పాయకరావుపేట అసెంబ్లీ నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. అనంతరం బీజేపీ సిద్ధాంతాలను ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. బీజేపీలో అంచెలంచెలుగా ఎదుగుతూ మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి వచ్చారు. భారతీయ జనతా మజ్దూర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పనిచేసారు. రాజేంద్రకుమార్ రాజకీయంగానే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ తనవంతు కృషి చేస్తున్నారు. తన తండ్రి పేరు మీద జేజే రావు మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు పేరు మీద సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానని అన్నారు. బీజేపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. రాబోయే 2019 ఎన్నికల్లో నరేంద్రమోడీని తిరిగి ప్రధాని చేయడానికి అందరూ శక్తివంచన లేకుండాకృషి చేయాలని అన్నారు. గత ప్రభుత్వాలు ఎస్సీలను ఓటు బ్యాంకు రాజకీయాలుగా వాడుకున్నాయని ఆరోపించారు. మోడీ ప్రభుత్వం ఎస్సీ సామాజికవర్గం పట్ల, అంబేద్కర్ పట్ల ఎంతో శ్రద్ద పెట్టిందని, దళితుల సంక్షేమానికి అనేక పథకాలను రూపొందించిందని అన్నారు. అంబేద్కర్ జీవితానికి ముడిపడి ఉన్న ఐదు స్థలాలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి పంచ క్షేత్రాల పేరుతో యాత్రస్థలాలుగా, స్ఫూర్తి క్షేత్రాలు తీర్చిదిద్దిందని అన్నారు. దేశ వ్యాప్తంగా దళితులు బీజేపీ వైపు మొగ్గుచూపుతున్నారని అన్నారు.

# రాఫెల్‌పై సుప్రీం తీర్పు ప్రతిపక్షాలకు చెంపపెట్టు

## బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్



అమలాపురం : రాఫెల్ ఒప్పంద రద్దు కోసం పాకిస్తాన్ ,చైనాల నుండి కాంగ్రెస్ పెద్దలకు ఎంత ముట్టిందని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్ తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. శుక్రవారం మధ్యాహ్నం స్థానిక ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. రాఫెల్ డీల్ విషయంలో ఎలాంటి కుంభకోణం జరగలేదని సుప్రీం కోర్టు తీర్పునిస్తూ అన్ని పిటిషన్‌ను కొట్టివేయడాన్ని స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలకు సుప్రీం ఎదురుదెబ్బ తగిలిందని, రాజకీయ ప్రయోజనాల కోసం దేశభద్రత విషయంలో బీజేపీపై బురద జల్లిన ప్రతిపక్షాలకు ఇది చెంపదెబ్బలాంటిదని అన్నారు. దేశ భద్రత విషయంలో సన్నద్దంగా ఉండాల్సిందేనని సూచించిందని అన్నారు. ఎన్నో ఏళ్ళుగా ఎంత మొత్తుకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం భారత సైన్యానికి కావలసిన ఆయుధాలను కొనుగోలు చేయలేక పోయారని అన్నారు. ఎప్పుడూ స్కామ్‌లు, కోర్టు కేసులలో మునిగి తేలే కాంగ్రెస్ పార్టీ సైన్యాన్ని పూర్తిగా నిర్వీర్యమయ్యేటట్టు చేసి దేశ భద్రతను గాలికొదిలేసిందని ఆరోపించారు. మూడింట రెండు వంతుల ఆయుధ సామాగ్రి పనికి రాకుండా పోయిందని, ఇది గమనించిన మోదీ ప్రభుత్వం ఆఘమేఘాల మీద సైన్యాన్ని బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుందన్నారు. అందులో రాఫెల్ యుద్ధ విమానాల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. పూర్తిగా నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తున్న మోదీ ప్రభుత్వాన్ని భారత దేశంలోనే కాక, ప్రపంచ వేదికల మీద కూడా దేశం పరువు తీసే విధంగా ప్రవర్తించిన 'పప్పు' నాయకుడు రాహుల్ గాంధీ ఇప్పుడు ఏం సమాధానం చెప్తారని నిలదీశారు. రాఫెల్ ఒప్పందంలో అవినీతి లేదని సుప్రీంకోర్టు తేల్చిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో చేసిన ఆరోపణలన్నీ అవాస్తవాలని తేలిపోయిందన్నారు. అవాస్తవ ఆరోపణలతో సాధించిన గెలుపు అనైతికమైనదని అంటూ వారు ఇప్పుడు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వారు గత రెండు రోజులుగా రాఫెల్ ఒప్పందం పేరుతో పార్లమెంటును స్థంభింపచేస్తున్నారని అంటూ, పార్లమెంటు నడపడానికి రోజుకు కోట్లలో వ్యయమవుతుందని, ఈ లెక్కన రెండు రోజులకు అయ్యే వృధా ఖర్చును వారు భరిస్తారా అని ప్రశ్నించారు. ఇది పూర్తిగా ప్రజలు చెల్లిస్తున్న పన్నుల నుండి వ్యయం చేస్తున్నారని, దీనిపై వారు ప్రజలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. రాహుల్ బావగారైన రాబర్ట్ వాద్రా, అతని మిత్రులు సంజయ్ బండారీ మొదలైన దళారీలకు ముడుపులు అందలేదు కనుక రాఫెల్ ఒప్పందం మీద ఇంత యాగీ చేశారా అని ఎద్దేవా చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ పెద్దలకు ఈ దళారీల నుండే కాకుండా పాకిస్తాన్, చైనా గూఢచారి సంస్థల నుండి కూడా ముడుపులు అందినట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. 1991 లో సాక్షాత్తు సోవియట్ పార్లమెంటు తమ గూఢచారి సంస్థల నుండి భారతదేశానికి చెందిన నెహ్రూ గాంధీ కుటుంబ పెద్దల స్విస్ బాంకు, ఇటాలియన్ ఎకౌంట్లలో ముడుపులు జమ చేసినట్లు ఒప్పుకున్నదని, కాంగ్రెస్ మంత్రి నవజోత్ సింగ్ సిద్ధు సాక్షాత్తు పాకిస్తాన్ సైన్యాధికారిని ఆలింగనం చేసుకోవడం, ఇమ్రాన్ ఖాన్‌ను పొగడ్తలతో ముంచెత్తడం, కాంగ్రెస్ పార్టీ ప్రచారాలలో పాకిస్తాన్ జిందాబాద్ అని నినాదాలు చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. తాత ముత్తాతల నుండి భారతదేశాన్ని తమ ప్రైవేటు ఆస్తిగా భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ దేశాన్ని ఏం చేయదలచుకుందని నల్లా పవన్‌కుమార్ తీవ్రంగా ప్రశ్నించారు. ఈ పరిణామాలను ప్రజలు గమనించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అమలాపురం అసెంబ్లీ ఇన్‌ఛార్జిఅయ్యగారి కృష్ణసుందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగా రాజేంద్రకుమార్, రాష్ట్ర నాయకులు బసవా సింహాద్రి, యువమోర్చా రాష్ట్ర కార్యదర్శులు గనిశెట్టి అరవింద్, దేశినీడి కిరణ్, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గోకరకొండ గంగన్నస్వామి, అరిగెల నాని, కాటా బాలయ్య, సలాది నాగేశ్వరరావు, కొండేటి ఈశ్వర్‌గౌడ్, కాశి ఫణీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మ రక్షణకు మార్షల్ ఆర్ట్సు ఎంతైనా అవసరం



రావులపాలెం :విద్యార్థులు విద్యతోపాటు కుంగ్‌ఫూ, కరాటేలను అలవర్చుకోవడంవల్ల మంచి ఆరోగ్యాన్ని ఆత్మ విశ్వాసాన్ని పొందు తారని సిఆర్‌సి రూప శిల్పి విక్టరి వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఇందిరా కమ్యూనిటీ హాలు నందు జిల్లా స్థాయి 7వ కుంగ్‌ఫూ బెల్ట్ టెస్టింగ్ ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్నట్లు కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ అధ్యక్షులు టి. అబ్బులు తెలిపారు. ఈ సందర్భముగా విద్యార్థుల కుంగ్‌ఫూ ప్రతిభా సర్టిఫికెట్లను విక్టరి సంస్థల అధినేత గొలుగూరి వెంకటరెడ్డి, ఎస్సై సిహెచ్ విద్యాసాగర్, సిఆర్‌సి అధ్యక్ష కార్యదర్శులు మల్లిడి కనికిరెడ్డి, కర్రి అశోక్‌రెడ్డి, విజయా ఆసుపత్రి డా॥ కొవ్వూరి వీరెడిలు ఆవిష్కరించారు. ఈ సందర్భముగా వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బాల్యం నుండే కుంగ్‌ఫూ, కరాటే, యోగా వంటివి నేర్చుకొని మంచి ఆరోగ్యంతో ఆత్మవిశ్వాసంతో మెలగాలన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లతోపాటు నైపుణ్యతను తెలిపే బెల్ట్, మెడల్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఈ పోటీల్లో విద్యార్థుల సాహస విన్యాసాలు, టైల్ బ్రేకింగ్, పొట్టపై బైక్ విన్యాసాలు, తలతో పెంకులు పగలు గొట్టడం వంటి మరిన్ని విన్యాసాలు విద్యార్థులు ప్రదర్శిస్తారని అబ్బులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వై. కిషోర్, సిహెచ్. చిరంజీవి, సత్యశ్రీ, ఎన్. సుబ్రహ్మణ్యం, ఎమ్. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పీవీ సింధు, సమీర్ వర్మ జైత్రయాత్ర

## వరల్డ్‌టూర్ ఫైనల్స్ సెమీస్ చేరిన భారత షట్లర్లు



గ్వాంగ్జౌ (చైనా): బ్యాడ్మింటన్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో భారత అగ్రశ్రేణి షట్లర్ పీవీ సింధు జైత్రయాత్ర కొనసాగిస్తోంది. తిరుగులేని విజయంతో టోర్నీ సెమీస్‌కు చేరుకుంది. పురుషుల విభాగంలోనూ సమీర్ వర్మ అద్భుతం చేశాడు. నాకౌట్ దశకు అర్హత సాధించాడు. వరుసగా మూడోసారి ఫైనల్స్ ఆడుతున్న సింధు గ్రూప్-ఏలో భాగంగా ప్రపంచ 12వ ర్యాంకర్ బీవెన్ జంగ్‌తో జరిగిన పోరులో 21-9, 21-16 తేడాతో వరుస గేముల్లో సునాయాస విజయం సాధించింది. తొలి గేమ్‌లో 0-4తో వెనకబడిన ఆమె ఆ తర్వాత పుంజుకుంది. 6-6తో స్కోరు సమం చేసింది. ఇక వెనుదిరిగి చూడలేదు. పవర్‌ఫుల్ స్మాష్‌లు, క్రాస్‌కోర్టు షాట్లతో విజృంభించింది.

17-8తో దూసుకెళ్లింది. 21-9తో గేమ్ ముగించింది. రెండో గేమ్‌లోనూ సింధుదే పైచేయి. వరుస పాయింట్లతో చెలరేగింది. 7-7, 11-9, 16-12తో దూసుకుపోయింది. కేవలం 15 నిమిషాల్లో ఆటను పూర్తి చేసింది.

మరో పోరులో 24 ఏళ్ల సమీర్ వర్మ తానెంత భయంకరంగా ఆడగలడో చూపించాడు. థాయ్‌లాండ్ ఆటగాడు కెంటాఫోన్ వాంగ్‌చారెన్‌ను 21-9, 21-18 తేడాతో వరుస గేముల్లో మట్టికరిపించాడు. కేవలం 44 నిమిషాల్లోనే ఆటను పూర్తిచేశాడు.

తొలి రౌండ్‌లో ప్రపంచ నంబర్ 1, ప్రపంచ విజేత కెంటో మొమోటో చేతిలో ఓడిన సమీర్ ఆ తర్వాత వరుసగా అన్ని రౌండ్లలో గెలిచాడు. గ్రూప్-బి నుంచి నాకౌట్ దశకు అర్హత సాధించాడు. అతడికి ఇదే తొలి వరల్డ్ టూర్ ఫైనల్స్ కావడం గమనార్హం.

# పెళ్లితో ఒక్కటైన

# స్టార్ షట్లర్లు సైనా - కశ్యప్



హైదరాబాద్: బ్యాడ్మింటన్ స్టార్లు సైనా నెహ్వాల్ (28)- పారుపల్లి కశ్యప్ (32)లు వివాహ బంధంతో ఒక్కటయ్యారు. గత కొంతకాలంగా ప్రేమలో ఉన్న వీరిద్దరూ శుక్రవారం కొంతమంది బంధువులు, సన్నిహితుల నడుమ రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. 2005 నుంచి కోచ్ పుల్లెల గోపిచంద్ వద్ద శిక్షణ పొందుతున్న ఇద్దరి మధ్య ప్రేమ చిగురించింది. గత పదేళ్లుగా డేటింగ్‌లో ఉన్న వీరిద్దరూ పెళ్లి చేసుకోబోతున్నట్టు అక్టోబరులోనే ప్రకటించారు.

ఇటీవల టీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్‌ను కలిసి వివాహ ఆహ్వాన పత్రిక అందించి ఆహ్వానించారు. అలాగే, సినీ నటుడు చిరంజీవి, గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్-విమల దంపతులతోపాటు మాజీ క్రికెటర్ వి.చాముండేశ్వర్, వీఆర్కే నాథ్, గోపీచంద్ తదితరులను ఆహ్వానించారు. ప్రముఖులను కలిసిన సందర్భంగా వారితో తీసుకున్న ఫొటోలను తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల్లో సైనా, కశ్యప్ పోస్టు చేశారు. తాజాగా ఈ ఉదయం కశ్యప్ ఉపనయన కార్యక్రమ ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి.

శుక్రవారం సైనా-కశ్యప్‌లు అత్యంత సాధారణంగా రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. ఇరు కుటుంబాలకు చెందిన దగ్గరి బంధువులు, సన్నిహితులు మాత్రమే వివాహానికి హాజరయ్యారు. 16న ఆదివారం ప్రముఖులకు వివాహ విందు ఇవ్వనున్నారు.

# వైకుంఠ ఏకాదశికి తిరుమల గిరులు ముస్తాబు

తిరుమల: వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాలకు తిరుమల గిరులు ముస్తాబవుతున్నాయి. ఈ నెల 18న వైకుంఠ ద్వార ప్రవేశానికి వేలాదిగా తరలి రానున్న భక్తుల కోసం టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. గంటల సమయం క్యూలో వేచి ఉండే అవసరం లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో స్వామివారి దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది ప్రణాళికలు రూపొందించి భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ అనుసంధానంగా నారాయణ గిరి ఉద్యానవనంలో పెద్ద ఎత్తున షెడ్లను నిర్మిస్తున్నారు.

జర్మన్ టెక్నాలజీతో 30 వేల మంది భక్తులు ఈ షెడ్లలో వేచి ఉండేలా వైకుంఠంకు అనుసంధానంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో షెడ్‌లో 2 వేలమంది భక్తులు వేచి ఉండేలా ఈ షెడ్లను నిర్మిస్తున్నారు. 18న వైకుంఠ ఏకాదశి దర్శనం కోసం 17వ తేదీ ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున తిరుమలకు చేరుకుంటారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో 30 నుంచి 40 గంటల వరకు స్వామివారి దర్శనానికి భక్తులు వేచి ఉండే పరిస్థితి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ రెండు రోజుల్లో 1.70 లక్షల మందికి మాత్రమే దర్శనం కల్పించే అవకాశం ఉంటుంది.

ANNAMALAI UNIVERSITY
Directorate of Distance Education
COURSES OFFERED
B.A., B.Com., BBA, BCA, B.Sc., M.A., M.Com., M.Sc., D.Litt., M.Litt.,
PG - MBA, MCA, Diploma, PG-Diploma,
Computer Science and IT Courses,
Industrial Safety, Lateral entry programs
UG & PG Discontinue Students
Direct Eligible Final Year
9603485698, 6281490615

LOANS / లోన్స్
HAPPY HOMES
We arrange Business Loans
Mortgage Loans
Home Loans, Personal Loans
and Pvt. Loans... Etc.,
94902 33750




# రెండో సెషన్‌లో బౌలర్ల విజృంభణ

## తొలి రోజు ఆసీస్ 277/6

పెర్త్: ఆస్ట్రేలియా కోరుకున్నట్టే ఆడింది. పట్టుదలగా నిలిచింది. అత్యంత బౌన్సీ, పేస్ పిచ్‌ను తయారు చేయించుకున్న ఆ జట్టుకు టాస్ రూపంలో అదృష్టమూ వరించింది. బ్యాట్స్‌మెన్ రాణించారు. తొలి సెషన్‌లో ఫించ్, హ్యారిస్ దుమ్మురేపారు. రెండో సెషన్లో టీమిండియా బౌలర్లు విజృంభించారు. మూడో సెషన్లో వికెట్లు పడ్డా కంగారూలదే ఆధిపత్యం. రెండో టెస్టు తొలిరోజు ఆట ముగిసే సరికి ఆతిథ్య జట్టు 277/6తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. మన బౌలర్లూ క్రమశిక్షణతో బంతులు విసిరారు.

తొలి సెషన్: పట్టుదలగా హ్యారిస్, ఫించ్

టాస్ గెలిచిన బ్యాటింగ్ ఆరంభించిన ఆసీస్‌కు ఓపెనర్లు మార్కస్ హ్యారిస్ (70; 141 బంతుల్లో 10x4), ఆరోన్ ఫించ్ (50; 105 బంతుల్లో 6x4) అద్భుత ఆరంభం అందించారు. తొలి వికెట్‌కు 112 పరుగుల భాగస్వామ్యం అందించారు. పచ్చికతో జీవం ఉట్టిపడుతున్న పిచ్‌పై తొలుత నిలిచారు. ఆచితూచి ఆడుతూ అందివచ్చిన బంతుల్ని బౌండరీకి తరలించారు.

టీమిండియా బౌలర్లు ఎంత ప్రయత్నించినా వికెట్ ఇవ్వలేదు. దీంతో భోజన విరామానికి ఆ జట్టు 66/0తో నిలిచింది.



రెండో సెషన్‌లో బౌలర్ల విజృంభణ

భోజన విరామం తర్వాత ఫించ్, హ్యారిస్ చెలరేగారు. ముందు హ్యారిస్ కెరీర్‌లో తొలి అర్ధశతకం బాదేశాడు. వేగంగా పరుగులు చేశాడు. ఇదే క్రమంలో ఫించ్ సైతం 50 పరుగుల మైలురాయి చేరుకున్నాడు.




ఒక మెరుగైన
రేపటి కవాతు వైపు

మీ ఆదాయపన్ను నిర్ధారిస్తుంది అందరి కోసం రేపటి రోజున ఉత్తమలుగా

అడ్వాన్సు ట్యాక్సు యొక్క మీ 3వ వాయిదాను
15 డిసెంబరు, 2018 లోగా చెల్లించండి

అడ్వాన్సు ట్యాక్సు చెల్లించవలసిన పన్ను చెల్లింపుదార్లు
- జీతం పొందు వారితో సహా ప్రతి చెల్లింపుదారుడు ఆర్థిక సంవత్సరానికిగానూ పన్ను మినహాయింపు/చెల్లింపులు మూలం వద్ద రూ. 10,000/- లేదా అంతకంటే ఎక్కువ తగ్గించబడినవారు
ఇంట్లోనే ఉండే వ్యాపారము/వృత్తి ద్వారా ఆదాయము లేని వయోవృద్ధులకు పన్ను చెల్లింపు నుంచి మినహాయింపు

చెల్లింపు విధానము
- కార్పొరేట్లు మరియు ఆదాయపు పన్ను చట్టపు 44 ఎబి సెక్షను క్రింద ఆడిట్ కావల్సిన ఖాతాలు కల్గిన పన్ను చెల్లింపుదార్లుందరికీ ఇ-చెల్లింపు తప్పనిసరి.
- ఇ-చెల్లింపు ఖచ్చితమైన క్రెడిట్‌ను భరోసా ఇస్తుంది కావున ఇతర పన్ను చెల్లింపుదార్లకు కూడా ఇ-చెల్లింపుదార్లకు కూడా ఇ-చెల్లింపు అనుకూలమైనది.

అడ్వాన్సు ట్యాక్సు చెల్లింపు కొరకు షెడ్యూలు

| గడువు తేది | నగదు |
|---|---|
| ఎ) 15 డిసెంబరు, 2018న లేదా అంతకుముందు | అడ్వాన్సు ట్యాక్సులో 75% చెల్లించవలెను |
| బి) 15 మార్చి, 2019న లేదా అంతకుముందు | అడ్వాన్సు ట్యాక్సులో 100% చెల్లించవలెను |

అడ్వాన్సు ట్యాక్సు తక్కువ చెల్లించుట / చెల్లించకపోవుట లేదా వాయిదా వేయుట వడ్డీకు దారి తీస్తుంది

davp 15401/13/0048/1819

www.incometaxindia.gov.in
www.cleanmoney.gov.in
@IncomeTaxIndia
డౌన్‌లోడ్ చేయండి "ఆయ్‌కార్ సేతు" పన్ను చెల్లింపుదారు సేవల మాడ్యుల్ & మొబైల్ అప్లికేషన్
ఆదాయ పన్ను విభాగము
కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com